PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి :42 సంచిక :240 | విజయవాడ, సోమవారం 3 ఏప్రిల్ 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Monday 3 April 2023 | Rs

దళిత స్కాలర్లపై
మూకదాడి
- ఐదుగురికి గాయాలు
- ఆర్ఎస్ఎస్ గూండాల దుశ్చర్య
- మహారాష్ట్రలోని గాంధీ వర్సిటీలో అర్ధరాత్రి ఘటన

• లోపలి పేజీలో.. •



సన్‌రైజర్స్.. అదే వ్యథ!
- ఛేదనలో చతికిల
- రాజస్థాన్ రాయల్స్ విక్టరీ



పల్నాడు జిల్లా పెదకూరపాడులో పిడుగుపడి మృతి చెందిన కౌలురైతు నరసింహారావు



విజయవాడ రూరల్‌లో నెలకొరిగిన జొన్న

అకాల వర్షంతో రైతు బెంబేలు
- తడిసిన ధాన్యం
- నేలరాలిన మామిడి, మొక్కజొన్న
- పిడుగు పడి కౌలురైతు మృతి

ప్రజాశక్తి-యంత్రాంగం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో శని, ఆదివారాల్లో కురిసిన అకాల వర్షానికి రైతులు బెంబేలెత్తుతున్నారు. ఈదురుగాలులలో వర్షం కురవడంతో పలు పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. మొక్కజొన్న నేలవాలగా, వరి పనలు తడిసి ముద్దయ్యాయి. ధాన్యం రాశులు నీట మునిగాయి. మామిడి నేలరాలింది. పిడుగుపాటుకు ఒకరు మృతి చెందగా, రెండు గేదెలు మృత్యువాతపడ్డాయి. పలుచోట్ల వరికుప్పలు దగ్ధమయ్యాయి. పల్నాడు జిల్లా పెదకూరపాడులో పిడుగుపాటుకు కౌలురైతు ఏనుగుల నరసింహారావు (45) మృతి చెందారు. కళ్లంలోని మిర్చిపైరుపై పట్టాలు కప్పిన అనంతరం వాటిని సరి చేస్తుండగా పిడుగుపడి అక్కడికక్కడే ఆయన మరణించారు. వినుకొండ పట్టణంలో రేకుల షెడ్లు, ఫ్లెక్సీలు, హోర్డింగులు గాలికి కొట్టుకుపోయాయి. ఏనుగుపాలెం రోడ్డులో భారీ వృక్షం కూలిపోవడంతో కొద్దిసేపు వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ స్తంభాలు ఒరిగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురంలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షానికి సుమారు 200 ఎకరాల్లో మొక్కజొన్న నేలమట్టమైంది. రాజమహేంద్రవరం, రాజమహేంద్రరం రూరల్, కడియం, రాజానగరంలో భారీ వర్షం కురిసింది. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం, మండపేట, రామచంద్రపురం మండలాల్లో వర్షాలకు వరి పనలు తడిసి ముద్దయ్యాయి. కాకినాడ జిల్లా జగ్గంపేట, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, సామర్లకోటలో రోడ్లు జలమయం అయ్యాయి. ఏలూరు జిల్లా లింగపాలెం మండలంలో మామిడికాయలు నేలరాలాయి. మొక్కజొన్న తడిసి ముద్దయింది. పోలవరంలోని పలువీధులు నీటమునిగాయి. బెస్తావీధి, కొత్తపేట, బాపూజీ కాలనీ, బిసి కాలనీ, మెయిన్ బజార్, కొత్త పట్టిసీమలో డ్రెయిన్లు పొంగిపొర్లాయి. పెదపాడు, పెదవేగి, దెందులూరు మండలాల్లో పలుచోట్ల మోస్తరు వర్షం కురిసింది. ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ రూరల్, జి.కొండూరు, మైలవరం, తిరువూరు, కృష్ణా జిల్లాలోని గన్నవరం, బాపులపాడు, కంచికచర్లలో ఈదురుగాలులతో కురిసిన వర్షానికి మామిడి కాయలు నేలరాలాయి. మొక్కజొన్న పంట నేలవాలింది. మునగతోటల్లో చెట్లు విరిగిపడిపోయాయి. పిడుగులు పడి మూడుచోట్ల వరి కుప్పలు దగ్ధమయ్యాయి. ధాన్యం రాశులు నీటమునిగాయి. పామర్రు మండలం పెదమద్దాలిలో పిడుగుపాటుకు రెండు పశువులు మృతి చెందాయి. తిరుపతి జిల్లా నిండలి, వెంకటరెడ్డిపల్లి, అంబల పూడి, చుట్టి, బాలాయపల్లిలో ఈదురుగాలులతో వడగళ్ల వర్షం కురిసింది. పలుచోట్ల వరి పంట నేలకు ఒరిగింది. మిర్చి కొమ్మలు విరిగాయి. మామిడి పిందెలు గాలులకు రాలిపోయాయి. అనకాపల్లి జిల్లా, విజయనగరం జిల్లాల్లో మోస్తరు వర్షం కురిసింది.

ఉపాధి, విద్య, శిక్షణ.. ఏదీ లేదు
33 శాతం మంది భారతీయ యువత పరిస్థితి
వీరిలో మహిళల సంఖ్యే ఎక్కువ
ఎన్ఎస్ఎస్ఓ సర్వేలో వెల్లడి

మోడీ పాలనలో దేశ యువత పరిస్థితి ఎంత దయనీయంగా ఉన్నదో తెలియజేసే సమాచారమిది. భారత్‌లో మొత్తం 33 శాతం మంది యువత ఎలాంటి ఉద్యోగ, ఉపాధి, విద్య, శిక్షణకు నోచుకోవటం లేదు. అంటే ప్రతి ముగ్గురిలో ఒకరు ఈ కోవకు చెందినవారే. ఇందులో మహిళల సంఖ్య అత్యధికంగా ఉండటం గమనార్హం. ప్రభుత్వానికి చెందిన నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ (ఎన్ఎస్ఎస్ఓ)కు చెందిన మల్టిపుల్ ఇండికేటర్ సర్వేలో వెల్లడైన నివేదిక సారమిది. ఈ సర్వేలో భాగంగా 2021లో 2.76 లక్షలకు పైగా ఇళ్ల నుంచి సమాచారాన్ని సేకరించి రూపొందించిన ఈ నివేదికను ఇటీవలే విడుదల చేశారు.



న్యూఢిల్లీ : భారత జనాభాలో మూడోవంతు ఉన్న యువతను మోడీ సర్కారు విస్మరిస్తున్నది. దేశంలోని యువతకు ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్నది 2014 సాధారణ ఎన్నికల సందర్భంగా మోడీ ఇచ్చిన కీలక హామీల్లో ఒకటి. అయితే, తొమ్మిదేళ్లు గడుస్తున్నా.. ఆ హామీని కేంద్రంలోని ఎన్‌డిఎ సర్కారు నిలబెట్టుకోలేదు. దీంతో దేశ యువత నిరుద్యోగ సమస్యతో సతమతమవుతున్నది. విద్య, ఉద్యోగం, శిక్షణను పొందలేకపోతున్నది. ఇప్పటికే పలు జాతీయ నివేదికలు ఈ విషయాన్ని స్పష్టం చేయగా, తాజాగా వెలువడిన ఎన్ఎస్ఎస్ఓ సర్వే నివేదిక సైతం ఇదే విషయాన్ని వెల్లడించింది.

ప్రపంచ సగటు కంటే ఎక్కువ
ఈ నివేదిక ప్రకారం.. భారత్‌లో విద్య, ఉపాధి, శిక్షణ లేని (నాట్ ఇన్ ఎడ్యుకేషన్, ఎంప్లాయ్‌మెంట్, ట్రైనింగ్ – నీట్) యువత (15 నుంచి 29 ఏళ్ల మధ్య ఉన్నవారు) సంఖ్య 33 శాతంగా ఉన్నది. ఐక్యరాజ్య సమితి వెల్లడించిన గణాంకాల ప్రకారం ప్రపంచ సగటు 22 శాతంగానే ఉండటం గమనార్హం. భారత్‌లో లింగ అంతరం కూడా చాలా ఎక్కువగా ఉన్నది. యువకుల్లో 15.4 శాతం మంది మాత్రమే ఈ జాబితా (నీట్)లో ఉండగా, యువతుల సంఖ్య 51.7 శాతంగా ఉన్నది.

మహిళలకు పెళ్లి, ఇంటి పనులు
ఈ విషయంలో మహిళలు చేసే ఇంటి శ్రమ లెక్కలోకి రావడం లేదు. వారు తమ ఇంటి పనుల్లోనే (అన్‌పెయిడ్ డొమెస్టిక్ లేబర్) నిమగ్నమై ఉండటంతో వారికి ఇలాంటి పరిస్థితి ఎదురవుతున్నది. ఇంటి పనుల్లో నిమగ్నమై ఉన్నామని 90 శాతం మంది మహిళలు తెలిపారు. యువకుల విషయంలో ఇది 7.3 శాతంగానే ఉండటం గమనార్హం. లింగ అంతరం తనకు ఎలాంటి ఆశ్చర్యాన్ని కలిగించలేదని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీకి చెందిన ప్రొఫెసర్, ఆర్థికవేత్త, రచయిత లేఖ చక్రవర్తి తెలిపారు. భారత్‌లోని అనేక కుటుంబాలు ఉద్యోగాల కంటే పెళ్లిళ్లను మహిళల 'ఆర్థిక భవిష్యత్తు'గా చూస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వాల అలసత్వానికి తోడు.. భారత్‌లో ఉన్న సామాజిక పరిస్థితులు, ఆచారాలు, కుటుంబ కట్టుబాట్లు, మహిళలపై ఉన్న ఆంక్షలు వారిని ముందుకు సాగేలా చేయడం లేదని కొందరు సామాజిక కార్యకర్తలు విమర్శించారు. 2021 సర్వే అంచనాల ప్రకారం.. 15–29 ఏళ్ల వయసున్న గ్రూపు సంఖ్య భారత జనాభాలో మూడోవంతు కావడం గమనార్హం.

ఉత్తర ప్రదేశ్‌లో లింగ అంతరం ఎక్కువ
ఈ విషయంలో బిజెపి పాలిత రాష్ట్రం ఉత్తర ప్రదేశ్ ఎక్కువ లింగ అంతరాన్ని కలిగి ఉన్నది. 2021కి సంబంధించిన సర్వే అంచనాల ప్రకారం ఉత్తర ప్రదేశ్ జనాభా దాదాపు 23 కోట్లు (12 కోట్ల మంది పురుషులు, 11 కోట్ల మంది స్త్రీలు). వీరిలో దాదాపు 30 శాతం మంది (6.8 కోట్ల మంది) 15–29 ఏళ్ల మధ్య వయసున్నవారే. వీరిలో మహిళల సంఖ్య 3.23 కోట్లు, పురుషుల సంఖ్య 3.67 కోట్లుగా ఉన్నది. వీరిలో 16 శాతం మంది యువకులు (ప్రతి ఆరుగురిలో ఒకరు) 'నీట్' జాబితాలో ఉన్నారు. ఈ జాబితాలో యువతుల సంఖ్య దాదాపు 60 శాతం (ప్రతి ముగ్గురిలో ఇద్దరు)గా ఉండటం ఆందోళనకరం.

జాబితాలో బిజెపి పాలిత రాష్ట్రాలు
యుపి తర్వాత నీట్ జాబితాలో పశ్చిమ బెంగాల్ (15.3 శాతం మంది యువకులు, 58.6 శాతం మంది యువతులు) ఉన్నారు. ఆ తర్వాతి స్థానంలో ప్రధాని మోడీ సొంత రాష్ట్రం గుజరాత్, పంజాబ్, బిజెపి పాలిత రాష్ట్రాలు మధ్యప్రదేశ్, అసోంలతో పాటు బీహార్ ఉన్నాయి. నీట్ విషయంలో తక్కువ లింగ అంతరంతో ఈశాన్య రాష్ట్రాలు పర్వాలేదనిపించాయి. అరుణాచల్‌ప్రదేశ్‌లో 4.2 శాతం మంది యువకులు, 5.8 శాతం మంది యువతులు, మిజోరాంలో ఇది వరుసగా 3.5, 7.7 శాతంగా ఉన్నది. నాగాలాండ్‌లో యువకులు 8.1 శాతం, యువతులు 18.1శాతంగా ఉన్నారు.

'ఉద్యోగం కంటే వివాహానికే ప్రాధాన్యతనిస్తున్న తల్లిదండ్రులు'
దేశ యువతకు విద్య, ఉద్యోగం, శిక్షణ వంటివి అందకపోతున్నప్పటికీ.. వారిలో ఏదైనా లక్ష్యాన్ని సాధించాలనే తపన అధికంగానే ఉన్నది. ఇక్కడ కూడా లింగ అంతరం కనిపిస్తున్నది. యువకులే (65.3 శాతం మంది) యువతుల (ఆరు శాతం) కంటే ఉపాధిని కోరటం లేదా ఉపాధి కోసం అందుబాటులో ఉంటున్నారు.

2013 మసాచూసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటి) అధ్యయనాన్ని ఉటంకిస్తూ చక్రవర్తి మాట్లాడుతూ.. మహిళలకు పెళ్లి ఒక ఆర్థిక నిర్ణయమని తెలిపారు. భారత్‌లోని మహిళలకు ఆర్థిక సాధికారత కోసం పెళ్లి ఒక సాధనమన్నారు. దీర్ఘకాలంలో.. విద్య, ఉద్యోగం కంటే మహిళకు చక్కగా పెళ్లి చేసి పంపించడమే పెద్ద నిర్ణయంగా తల్లిదండ్రులు భావిస్తున్నారని తెలిపారు. పెళ్లి తర్వాత మహిళలు చాలామంది విద్య, ఉద్యోగాన్ని వదిలేస్తున్నారని చెప్పారు. ఇలాంటి కారణాలతో 'నీట్' అంచనాల్లో స్త్రీల సంఖ్య పెరుగుతున్నదని చక్రవర్తి వివరించారు. సమాజంలో మార్పు రానంత వరకు ఈ సమస్యకు పరిష్కారం లభించదని అభిప్రాయం వ్యక్తం చేశారు.

వైజాగ్ స్టీల్ ప్రయివేటీకరణ ఆపండి
- కేంద్రానికి కెటిఆర్ లేఖ

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో



విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రయివేటీకరించే కుట్రలను విరమించుకోవాలని భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి రామారావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికులు, ప్రజలు ఆందోళనలు చేస్తోన్నా దొడ్డిదారిన ప్రయివేటుకు కట్టబెట్టే కుతంత్రానికి కేంద్రం తెరలేపిందన్నారు. వర్కింగ్ కాపిటల్, ముడిసరుకు కోసం నిధుల సమీకరణ పేరిట స్టీల్ ప్లాంట్ తాళాలను ప్రయివేట్ కంపెనీలకు అప్పజెప్పేందుకు కేంద్రం ఏకంగా ఒక నోటిఫికేషన్ జారీ చేయడం దుర్మార్గమని దుయ్యబట్టారు. ఈ మేరకు కేంద్రానికి ఆదివారం ఆయన లేఖ రాశారు. 'వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ కుట్రలను బిఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం స్టీల్ ప్లాంట్‌ను ఐరన్ ఓర్ గనులు కేటాయించకుండా పథకం ప్రకారం నష్టాల్లోకి నెట్టి లక్షల కోట్ల రూపాయల విలువైన ఆస్తులను అప్పనంగా ప్రయివేట్ కార్పొరేట్ మిత్రులకు అప్పగించాలని చూస్తోంది. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌లో వంద శాతం ఉత్పత్తి జరిగితే కంపెనీ లాభాల బాట పడుతుంది. దాదాపు లక్ష కోట్ల రూపాయలతో విస్తరణ ప్రణాళికను ప్రకటించిన స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (సెయిల్)లో వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను కలిపితే స్వాగతిస్తాం. దీనివల్ల తెలంగాణ ప్రభుత్వం ఎన్నాళ్లుగానో డిమాండ్ చేస్తున్న బయ్యారం స్టీల్ ప్లాంట్‌తోపాటు కడపలోనూ మరో ఉక్కు కర్మాగారం ఏర్పాటుకు ఇకో సిస్టం ఏర్పడుతుంది. దేశ మౌలిక రంగానికి అవసరమైన స్టీల్ సరఫరా భద్రత ప్రయివేట్ కంపెనీల దాయాదాక్షిణ్యాల మీద ఆధారపడాల్సిన అవసరం ఉండదు. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు రూ.5 వేల కోట్లను వెంటనే కేటాయించాలి. వైజాగ్ స్టీల్ ప్లాంట్ తెలుగు ప్రజల హక్కు. దాన్ని కాపాడుకోవడానికి తెలుగువారందరూ కలిసి రావాలి' అని ఈ లేఖలో పేర్కొన్నారు.

ఐక్య పోరాటాలకు
సిద్ధం కావాలి
- సిపిఎస్, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానాలు వద్దు
- యుటిఎఫ్ కౌన్సిల్‌లో సిఐటియు అధ్యక్షులు నాగేశ్వరరావు

• లోపలి పేజీలో.. •

40 మందికి నిరాకరణ !
- పనితీరు ఆధారంగానే టికెట్లు
- ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇంచార్జీలతో నేడు సిఎం కీలక భేటీ

ఆర్ఎల్‌వి ఎల్ఇఎక్స్
ప్రయోగం సక్సెస్ : ఇస్రో



• లోపలి పేజీలో.. •

నేటి నుంచి 'పది' పరీక్షలు
- ఉదయం 9.30 గంటలకు ప్రారంభం
- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 18 వరకు జరగనున్న ఈ పరీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా 3,349 పరీక్ష కేంద్రాల్లో 6,64,152 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరగనున్నాయి. ఉదయం 8:45 గంటలకు పరీక్ష కేంద్రంలోకి విద్యార్థులకు అనుమతి ఉంటుంది. 9:30 దాటితే అనుమతించబోమని ఇప్పటికే అధికారులు వెల్లడించారు. ప్రత్యేకమైన అదికూడా సహేతుకమైన కారణాలుంటేనే విద్యార్థులకు అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు.

పది పరీక్షలు రాసేందుకు బాలురు 3,11,329 మంది, బాలికలు 2,97,741 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరు కాకుండా 53,410 మంది సప్లమెంటరీ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నారు. ప్రతి గదికి 24 మంది చొప్పున విద్యార్థులను ఎస్ఎస్‌సి బోర్డు కేటాయించింది. 838 స్క్వాడ్‌లను ఏర్పాటు చేయగా వీరిలో 682 మంది సిట్టింగ్, 156 మంది ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఉన్నారు.

ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో కేవలం ప్రభుత్వ ఉపాధ్యాయులు మాత్రమే ఇన్విజిలేషన్ విధులు నిర్వహించనున్నారు. దగ్గరలో జిరాక్స్ సెంటర్లను కూడా నిర్వాహకులు మూసేయాల్సి ఉంటుంది. పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంటుతో సహా ఎవరూ మొబైల్‌ను తీసుకెళ్లకూడదు. ప్రశ్నాపత్రాన్ని ఎవరైనా సామాజిక మాధ్యమాల ద్వారా పరీక్షకు ముందు, పరీక్ష జరిగే సమయంలో ప్రచారం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని విద్యాశాఖ హెచ్చరించింది. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్ చూపించి ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం చేయవచ్చునని ఆర్టీసి ఇప్పటికే ప్రకటించింది. తొలిసారిగా ఆరుగురు అంధ విద్యార్థులు వారే స్వయంగా పరీక్షను కంప్యూటర్‌పై రాసే ఏర్పాట్లు అధికారులు చేశారు. పరీక్షలు జరిగే పాఠశాలల్లో ఇతర తరగతుల విద్యార్థులకు సెలవు ఉంటుంది. మధ్యాహ్నం నుంచి 250 కేంద్రాల్లో ఓపెన్ టెన్త్, ఇంటర్ విద్యార్థులకు పరీక్షలు జరగనున్నాయి. విజయవాడలోని పటమట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి పరీక్షా కేంద్రంలోని ఏర్పాట్లను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్ సురేష్ కుమార్, ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ డి దేవానంద రెడ్డి ఆదివారం పరిశీలించారు.

న్యాయసమ్మతం కాని సుదీర్ఘ జైలు సరికాదు
వ్యక్తిగత స్వేచ్ఛను బలిపెట్టొద్దు : సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ : న్యాయసమ్మతం కాని పద్ధతిలో ఎవరూ జైలు శిక్ష అనుభవించకూడదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నేరాలను నిరోధించడం, శాంతి భద్రతలను కాపాడటం రాష్ట్రాల బాధ్యత అయినప్పటికీ, వ్యక్తిగత స్వేచ్ఛను బలిపెట్టకూడదని పేర్కొంది. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 167 (2)లోని ప్రొవిసో (ఎ) ప్రకారం రిమాండ్ తేదీ నుండి 60 రోజులలోపు దర్యాప్తు చేస్తున్న సంస్థ ఛార్జిషీట్ దాఖలు చేయడంలో విఫలమైతే, నిందితుడు డిఫాల్ట్ బెయిల్‌కు అర్హులు. నిర్దిష్ట కేటగిరీ నేరాలకు, నిర్ణీత వ్యవధిని 90 రోజుల వరకు పొడిగించవచ్చు. రిమాండ్ విధించిన తేదీ నుంచే ఆ గడువును లెక్కించాలా? ఆ రోజును మినహాయించాలా? అనే చట్టపరమైన వివాదం సుప్రీంకోర్టు పరిశీలనకు వచ్చింది. ఈ అంశంపై జస్టిస్ కెఎం జోసెఫ్, జస్టిస్ హృషికేశ్‌రాయ్, జస్టిస్ బివి నాగరత్న ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. సెక్షన్ 167 సిఆర్‌పిసి కింద నిర్దేశించిన 60/90 రోజుల రిమాండ్ వ్యవధిని మేజిస్ట్రేట్ రిమాండ్‌కు పంపించిన తేదీ నుంచి లెక్కించాలని ధర్మాసనం పేర్కొంది. "న్యాయ సంస్థల ఆదేశం లేకుండా ఎవరూ జైలు శిక్ష అనుభవించకూడదు. నేరాలను నిరోధించడం, శాంతిభద్రతలను పరిరక్షించడం రాష్ట్రం బాధ్యతే. అలా అని వ్యక్తిగత స్వేచ్ఛను బలిపెట్టకూడదు" అని ధర్మాసనం పేర్కొంది. నిర్ణీత 60/90 రోజుల వ్యవధిలో ఛార్జిషీట్ లేదా రిమాండ్ కోసం అనుబంధ అభ్యర్థనను దాఖలు చేయడంలో రాష్ట్రం విఫలమైతే, వ్యక్తి హక్కులు, ఆ హక్కులపై పరిమితి మధ్య సమతుల్యతను పాటించాలని, దీర్ఘకాలం నిర్బంధించకుండా నిరోధించాలని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. 'అధికారులు నిందితులను నిర్బంధించడానికి, దర్యాప్తును సులభతరం చేయడానికి చట్టం అనుమతిస్తుంది. సుదీర్ఘమైన జైలు శిక్షను నిరుత్సాహపరచడం కోర్టు బాధ్యత. డిఫాల్ట్ బెయిల్ హక్కు తదుపరి ఛార్జిషీట్ దాఖలు చేయడం ద్వారా ఆపివేయబడదు. డిఫాల్ట్ బెయిల్ పొందే హక్కు కొనసాగుతోంది" అని ధర్మాసనం పేర్కొంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఇడి) డైరెక్టరేట్ విచారిస్తున్న యెస్ బ్యాంక్ మనీలాండరింగ్ కేసులో డిహెచ్ఎఫ్ఎల్ మాజీ ప్రమోటర్లు కపిల్ వధావన్, ధీరజ్ వధావన్‌లకు డిఫాల్ట్ బెయిల్ మంజూరు చేస్తూ బాంబే హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై ఇడి దాఖలు చేసిన పిటిషన్‌ను విచారిస్తున్నప్పుడు న్యాయపరమైన ప్రశ్న తలెత్తడంతో, సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ అంశంపై స్పష్టతనిచ్చింది.

ఖనిజ భూములపై పెద్దల కన్ను!
- గిరిజనులు, బిసిలను వెళ్లగొట్టే యత్నాలు
- పురావస్తు శాఖ ద్వారా బెదిరింపులు

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో


గిరిజనుల, బిసిల భూములపై అధికార పార్టీకి చెందిన ఇద్దరు బడాబాబుల కన్ను పడింది. ఆ భూములు లాక్కొని వాటిలోని ఖనిజ నిక్షేపాలను కొల్లగొట్టాలని చూస్తున్నారు. ఇందుకు పురావస్తు శాఖను రంగంలోకి దింపి బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఊరుకు ఊరే ఖాళీ చేయించాలని చూస్తున్నారు. దీంతో, ఈ ప్రాంతంలో దశాబ్దాల తరబడి నివసిస్తోన్న గిరిజనులు, బిసిలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

తిరుపతి జిల్లా వరదయ్యపాళెం మండలం పాండూరు పంచాయతీ పరిధిలోని ముట్టంగితిప్ప గ్రామంలో గిరిజనులు, సుబ్బయ్యనాయుడు కండ్రిగ గ్రామంలో బిసిలు దశాబ్దాలుగా నివాసం ఉంటున్నారు. సర్వే నంబర్ 774, 1120, 1124లోని 65 ఎకరాలను సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. పొలాల్లోనే ఇళ్లు కట్టుకొని జీవిస్తున్నారు. ఈ భూముల్లోని 50 ఎకరాలను 1975లో 80 గిరిజన కుటుంబాలకు, 15 ఎకరాలను 1978లో 15 బిసి కుటుంబాలకు అప్పటి ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసింది. ఈ భూముల్లో అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల నిర్మాణం జరిగింది. చెన్నయ్ ఈస్టు సర్కిల్‌కు చెందిన పురావస్తు శాఖాధికారులు ఈ భూములు తమవని, ఈ ప్రాంతాన్ని వెంటనే ఖాళీ చేయాలని బెదిరిస్తున్నారని గిరిజనులు, బిసిలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమకు ప్రభుత్వం పట్టాలిచ్చిందని, పురావస్తు శాఖ భూములైతే తమకు పట్టాలు ఎలా ఇస్తారని, స్కూలు, అంగన్‌వాడీ భవనం ఎలా కడతారని, ఇన్నాళ్లూ ఈ భూముల విషయం పురావస్తు శాఖకు గుర్తులేదా? అంటూ ప్రశ్నిస్తున్నారు. ఈ భూములను లాక్కుంటామంటే తాము ఒప్పుకునేది లేదని తేల్చి చెప్పుతున్నారు. పురావస్తు శాఖ తీరుపై స్థానిక రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు మౌనంగా ఉండడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ భూముల్లో ఐరన్ ఓర్ నిక్షేపాలను కొల్లగొట్టేందుకు పురావస్తు శాఖను అడ్డుపెట్టుకొని ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన ఒక మంత్రి, ఒక ఎమ్మెల్యే కలిసి తమను వెళ్లగొట్టాలని చూస్తున్నారని గిరిజనులు, బిసిలు చెబుతున్నారు. ఈ భూములు తిరుపతి జిల్లా సత్యవేడులోని శ్రీ సిటీ సెజ్‌కు మూడు కిలోమీటర్లు, చెన్నయ్‌కు 23 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. ఇక్కడ ఎకరం భూమి విలువ రెండు కోట్ల రూపాయలకుపైనే ఉంది. పైగా, నిక్షేపాలు ఉండడంతో ఈ భూములు మరింత ఖరీదయ్యాయి.



ముట్టంగితిప్ప ప్రాంతం

కలెక్టర్‌కు ఫిర్యాదు
గ్రామాన్ని ఖాళీ చేయాలని, భూముల నుంచి వైదొలగాలని పురావస్తు శాఖాధికారులు బెదిరిస్తున్నారంటూ గిరిజనులు, బిసిలు కలిసి శనివారం కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డికి ఫిర్యాదు చేశారు. దీనిపై ఆయన స్పందిస్తూ సూళ్లూరుపేట ఆర్‌డిఓకు వివరంగా చెప్పాలని, మీ ప్రాంతానికి వచ్చి పరిశీలించి న్యాయం జరిగేలా చర్య తీసుకుంటానని హామీ ఇచ్చారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ధనంజయులు, మునిస్వామి, వసంతమ్మ ఉన్నారు.



అయోమయంలో 'బొండాలు' కొనుగోలు

• లోపలి పేజీలో.. •

ఫలించిన పోరాటం
- కార్మిక సంఘాల ఆందోళనతో దిగొచ్చిన ఆంధ్రపేపర్ మిల్లు యాజమాన్యం
- మృతుని కుటుంబానికి రూ.22 లక్షల పరిహారం, ఉద్యోగం ఇచ్చేందుకు అంగీకారం

రాయలసీమ డిక్లరేషన్ ఏమైంది?

- బిజెపికి పేర్ని నాని ప్రశ్న

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కర్నూలులో 2018లో బిజెపి అగ్రనేతలు సమావేశమయి ప్రకటించిన రాయలసీమ డిక్లరేషన్ ఏమైందో రాష్ట్ర ప్రజలకు బిజెపి నేతలు చెప్పాలని మాజీ మంత్రి పేర్ని నాని డిమాండ్ చేశారు. ఆదివారం తాడేపల్లిలోని వైసిపి కేంద్రకార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాయలసీమకు హైకోర్టును ఇవ్వడంతోపాటు రాష్ట్రానికి రెండో రాజధానిగా ప్రకటించాలని డిక్లరేషన్‌లో డిమాండ్ చేశారని ఆయన పేర్కొన్నారు. అలాగే కొన్ని ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించడంతో పాటు ఒక సెషన్ అసెంబ్లీ సమావేశాలను కూడా రాయలసీమలో జరపాలని డిమాండ్ చేసిన బిజెపి ఇపుడు ఏ నైతికతతో అమరావతికి మద్దతు ఇస్తోందని ప్రశ్నించారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక రాయలసీమకు హైకోర్టు ఇస్తామంటే అన్నీ అమరావతిలోనే వుండాలని రెండునాలుకలతో మాట్లాడటం తగదన్నారు. చంద్రబాబు రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో వైసిపిని ఓడిస్తామని ప్రకటన చేశారని అసలు టిడిపికి 175స్థానాల్లో పోటీచేసే ధైర్యం వుందా అని ప్రశ్నించారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ పులివెందులలో పోటీ చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

ఎపిజెఎసి అమరావతి ఉద్యమ కార్యాచరణకు మద్దతు

- గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంస్థ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎపి అమరావతి జెఎసి ఉద్యమ కార్యాచరణకు ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంస్థ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. గవర్నర్‌పేట రెవెన్యూ భవన్‌లో ఆదివారం ఎపి జిఎడబ్ల్యుఎస్ఇడబ్ల్యుఒ రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు సంస్థాగతంగా ఎదుర్కొన్నటువంటి సమస్యల పరిష్కారం కోసం వివిధ దశల్లో వినతి పత్రాలు అందజేసి ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని రాష్ట్ర కార్యవర్గం తీర్మానించింది. ఎపి జెఎసి అమరావతి ఉద్యమకార్యాచరణలో తప్పకుండా ప్రతి ఒక్కరూ నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరుకావాలని, వర్క్ టు రూల్ విధిగా పాటించాలని కూడా సంక్షేమ సంస్థ తీర్మానించింది. ఈ సమావేశంలో ఎపిజెఎసి అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పోలిశెట్టి దామోదర్, కోశాధికారి వివిమురళీకృష్ణ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

టోల్ చార్జీలు రాష్ట్ర ప్రభుత్వమే భరించాలి

- టిడిపి ఎమ్మెల్యే డోలా వీరాంజనేయస్వామి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టోల్ చార్జీలను రాష్ట్ర ప్రభుత్వమే పూర్తిగా భరించాలని టిడిపి ఎమ్మెల్యే డోలా బాలవీరాంజనేయస్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ 5 శాతం పెంచనున్న టోల్ చార్జీలతో వాహనదారులపై తీవ్ర భారం పడుతుందని తెలిపారు. వైసిపి పాలనలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. నిత్యావసర వస్తువులు, గ్యాస్, పెట్రోల్, డీజిల్, కరెంట్ చార్జీలు భారీగా పెరిగి సామాన్యులు బతకలేని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. లారీ యజమానులు, వాహనదారులపై భారం పడకుండా కేంద్రం పెంచనున్న టోల్ చార్జీలను పూర్తిగా రాష్ట్రప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. కాగా వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలోని ఆర్యవైశుల్ని అనేక ఇబ్బందులకు గురిచేస్తోందని టిడిపి వాణిజ్య విభాగం అధ్యక్షులు డూండి రాకేశ్ విమర్శించారు. టిడిపి కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆర్యవైశ్యులంటే ప్రభుత్వానికి ఎందుకంత చులకన అని ప్రశ్నించారు.

ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి

- సిపిఎస్, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానాలు వద్దు
- యుటిఎఫ్ కౌన్సిల్‌లో సిఐటియు అధ్యక్షులు నాగేశ్వరరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సిపిఎస్ రద్దు కోసం, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానాలకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఏవి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. పాలకులు కార్పొరేట్ల పక్షాన కాకుండా ప్రజల పక్షాన నిలబడేలా ఉద్యోగ, ఉపాధ్యాయులు పోరాటం చేయాలని కోరారు. ఎంబి విజ్ఞాన కేంద్రంలో శనివారం ప్రారంభమైన యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం ఆదివారం కూడా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నాగేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో అన్ని ప్రభుత్వరంగ సంస్థలను అమ్మకానికి పెడుతుందని, ప్రభుత్వంలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానంలో ఉద్యోగాలను నియమిస్తుందని పేర్కొన్నారు. ఆర్థిక మాంద్యం ప్రభావం వల్ల ఉపాధి కోల్పోతున్న ప్రజలు అభివృద్ధి చెందిన దేశాలతో పాటు, ఇతర యూరోపియన్ దేశాల్లో పోరాటాలు జరుగుతున్నాయని వెల్లడించారు. కరోనా కాలంలో కూడా ప్రజలకు తిండి దొరకకపోయినా అదానీ, అంబానీ ఆదాయం లక్షల కోట్లు పెరిగిందన్నారు. ప్రజల పక్షం కాకుండా కార్పొరేట్లకు అనుగుణంగా ప్రభుత్వాలు వ్యవహరించడం వల్లే ఈ దుస్థితి ఏర్పడిందన్నారు. పెన్షన్‌కు రావాల్సిన డబ్బు కార్పొరేట్ల ఖాతాల్లోకి వెళ్లిపోతుందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏవి నాగేశ్వరరావు

ఎన్ఇపి రద్దు చేయాలని తీర్మానం

కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ విద్యావిధానం (ఎన్ఇపి)-2020ను రద్దు చేయాలని కోరుతూ కౌన్సిల్ సమావేశం తీర్మానించింది. ఎన్ఇపిలోని ప్రతి అంశం కేంద్రీకరణ, వ్యాపారీకరణ, మతతత్వీకరణ లక్ష్యంగానే ఉన్నాయని విమర్శించింది. ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసి కార్పొరేట్లకు అధిక లాభాలు చేకూర్చే సాధనంగా ఎన్ఇపి ఉందని విమర్శించింది. దీనిని రద్దు చేసి రాజ్యాంగ విలువలతో కూడిన విద్యావిధానాన్ని రూపొందించాలని డిమాండ్‌చేసింది. ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాల నుంచి మినహాయించి, ప్రభుత్వ పాఠశాల వ్యవస్థను బలోపేతం చేయాలని తీర్మానించింది. ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని, ఆర్థిక బకాయిలన్నీ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేసింది. ఉపాధ్యాయులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని కోరింది.

నూతన కమిటీ ఎన్నిక

ఫెడరేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్‌లను, గౌరవ అధ్యక్షులుగా కె శ్రీనివాసరావును కౌన్సిల్ ఎన్నుకుంది. సహాధ్యక్షులుగా ఎఎస్ కుసుమకుమారి, కె సురేష్ కుమార్, కోశాధికారిగా బి గోపిమూర్తి, కార్యదర్శులుగా బి లక్ష్మీరాజా, ఎస్ నాగమణి, టి రఘుపతిరెడ్డి, సిహెచ్ రవీంద్ర, ఎస్‌పి మనోహర్ కుమార్, డివి రాఘవులు, ఎస్ మురళిమోహనరావు, ఎన్ అరుణకుమారి, ఎస్ఎస్ నాయుడు, ఎన్ నవకోటేశ్వరరావు, వి కోటేశ్వరప్ప, కెఎ ఉమమహేశ్వరరావు, రెడ్డి మోహనరావు, డి అన్నారాము, బి సుభాషిణిలను ఎన్నుకుంది. ఐక్య ఉపాధ్యాయ ప్రచురణల కమిటీ చైర్మన్‌గా ఎం హనుమంతరావు, ప్రధాన సంపాదకులుగా ఎన్ కుమార్ రాజాలను, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా టిఎస్ఎల్ఎన్ మల్లేశ్వరరావు, సభ్యులుగా బి శ్రీదేవి, పి రమణారెడ్డి, ఎంవి సుబ్బారెడ్డి, జెఆర్‌సి పట్నాయక్, ఎస్ జాబీర్, టి విజయకృష్ణలను ఎన్నుకుంది.

ప్రధానోపాధ్యాయులపై యాప్‌ల భారం తగ్గించాలి

- ఎపి ప్రధానోపాధ్యాయ సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రధానోపాధ్యాయులపై యాప్‌ల భారం రోజు రోజుకీ తీవ్రతరమవుతుందని, తక్షణమే యాప్‌ల భారం తగ్గించాలని ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయ సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. విజయవాడ రెవెన్యూభవన్‌లో జరిగిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆదివారం మీడియాకు విడుదల చేశారు. నాడు-నేడులో అనవసరమైన ఒత్తిడికి గురి చేస్తున్నారని, తక్షణమే బాధ్యతల నుంచి తప్పించి కేవలం పర్యవేక్షణకు మాత్రమే పరిమితం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎపిజెఎసి అమరావతిలో భాగస్వామ్య సంఘంగా ఉన్న ఎపి ప్రధానోపాధ్యాయ సంఘం, జెఎసి చేపట్టిన ఉద్యమ కార్యాచరణలో చురుకుగాపాల్గొనాలని, ఆందోళనా కార్యక్రమాల్లో ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యాయులు ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొనాలని రాష్ట్ర కౌన్సిల్‌లో తీర్మానం చేసినట్లు పేర్కొన్నారు. 2023-24 విద్యాసంవత్సరంనుంచి పాఠశాలనిర్వహణ నిధులను రెట్టింపు చేయాలని సంఘం ప్రభుత్వాన్ని కోరింది. రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఎపిజెఎసి అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఎపి ప్రధానోపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.ఓంకార్‌యాదవ్, గౌరవాధ్యక్షులు వెంకటరమణ, ప్రధానకార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సచివాలయాల ఉద్యోగులతో సర్కార్ దోబూచులాట

- బదిలీల కోసం ఎదురు చూపులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల. బదిలీల ప్రక్రియకు మార్గం సుగమం చేయకుండా ప్రభుత్వం రేపో మాపో అంటూ దోబూచులాడుతోంది. బదిలీలు ఎప్పుడు చేపడతారనే విషయంపై గ్రామ, వార్డు సచివాలయాల శాఖ నుంచి స్పష్టత కరువైంది. గతేడాది సెప్టెంబరు నుంచి బదిలీల ప్రకియ చేపట్టాలనే డిమాండ్ రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులనుంచి బలంగా వినబడుతోంది. ఉద్యోగ సంఘాల నుంచి ప్రభుత్వానికి వినతులు రావడంతో విద్యార్థుల చదువులకు ఇబ్బంది లేకుండా విద్యా సంవత్సరం ప్రారంభంలో బదిలీల ప్రక్రియ చేపట్టే అవకాశాలున్నాయని ఆ శాఖ ఉన్నతాధికారులు గతంలో పేర్కొన్నారు. అయితే ఆచరణలో అడుగు కూడా ముందుకు పడిన దాఖలాల్లేవు. ముందస్తు ఎన్నికలు రావచ్చునే ప్రచారం నేపథ్యంలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియను చేపట్టి తేనెతుట్టెను కదిలించే సాహసం చేయరాదని.. ప్రభుత్వమే బదిలీల ప్రక్రియపై మీనమేషాలు లెక్కిస్తున్నట్లు కనిపి స్తోంది. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్ల సేవలను వినియోగించుకొని ఎన్నికల్లో లబ్ధి పొందవచ్చుని వైసిపి నేతల ఆశ. ఈ నేపథ్యంలో గ్రామ, వార్డు సచివాల య ఉద్యోగుల బదిలీల ప్రక్రియకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశాలు స్వల్పంగా ఉండొచ్చుని లేని పక్షంలో బదిలీల ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేసుకునే అవకాశం కూడా లేక పోలేదనే ప్రచారం జరుగుతోంది. కాగా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల మొదటి బ్యాచ్ రెగ్యులర్ అయిన నేపథ్యంలో బదిలీల ప్రక్రియ చేపడతారనే వారి ఆశలపై ప్రభుత్వ వైఖరి నిప్పుమీద నీళ్ల చల్లినట్లుగా ఉందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లౌకిక భావాలను వ్యాప్తి చేయాలి

- కేరళ ఫిలిం కార్పొరేషన్ చైర్మన్ నీలకంఠన్ కరుణ
- ముగిసిన పుచ్చలపల్లి సుందరయ్య 20వ జాతీయ స్థాయి నాటకోత్సవాలు


సుందరయ్య చిత్రపటం వద్ద నీలకంఠన్ కరుణ, సి.ఉమామహేశ్వరావు తదితరులు

ప్రజాశక్తి- చిలకలూరిపేట (పల్నాడు జిల్లా)

ఘర్షణలకు తావులేకుండా దేశం సుభిక్షంగా ఉండాలంటే లౌకిక భావాలను వ్యాప్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని కేరళ ఫిలిం కార్పొరేషన్ చైర్మన్, మళయాల సినీ దర్శకులు శాసి నీలకంఠన్ కరుణ అన్నారు. పల్నాడు జిల్లా యడ్లపాడులలో మూడ్రోజులపాటు జరిగిన పుచ్చలపల్లి సుందరయ్య 20వ జాతీయ స్థాయి నాటకోత్సవాలు ఆదివారం రాత్రి ముగిశాయి. మూడో రోజు ప్రదర్శనలను ముఖ్యఅతిథులుగా హాజరైన నీలకంఠన్ కరుణ, తెలుగు సినీ దర్శకులు సి.ఉమామహేశ్వరరావు ప్రారంభించారు.

ఈ సందర్భంగా సుందరయ్య నిలువెత్తు చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. నీలకంఠన్ కరుణ మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య ఎంతో ఆదర్శవంతమైన నాయకుడని, ఆయన పేరు మీద నాటక ప్రదర్శనలు అభినందనీయమని అన్నారు. ప్రదర్శనల నిర్వహణ చాలా బాగుందని, కళాకారులకు మంచి భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. అభ్యుదయ, ప్రజోపయోగ అంశాలను మరింతగా ప్రదర్శించాలని సూచించారు. సి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ నాటక రంగం గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటొన్న నేపథ్యంలో ఇలాంటి ఉత్సవాల నిర్వహణ హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా కాపలా, ప్రేమతో నాన్న, పక్కింటి మొగుడు, వేలి మీద సిరా చుక్క నాటికలను ప్రదర్శించారు.

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ దారుణ హత్య

- తమ్ముడు తప్పు చేశాడని అన్నను చంపేశారు!



ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ దారుణ హత్యకు గురయ్యాడు. ఆయన తమ్ముడు చేసిన తప్పుకు అన్నను బలితీసుకున్నారు. హతుని కుటుంబసభ్యుల కథనం ప్రకారం... చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం బ్రాహ్మణపల్లికి చెందిన నాగరాజు (36) చెన్నయ్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నారు. ఆయన తమ్ముడు పురుషోత్తంకు ఆ గ్రామానికి చెందిన ఒక ప్రజాప్రతినిధి తమ్ముడి భార్యతో వివాహేతర సంబంధం ఉన్నట్లు సమాచారం. ఈ విషయమై నాగరాజు, ప్రజాప్రతి కుటుంబాల మధ్య కొద్ది రోజులుగా పంచాయితీ నడుస్తోంది. ఈ నేపథ్యంలో రాజీకి వద్దామంటూ ప్రజాప్రతినిధి తమ్ముడు... గోపి అనే మరో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ద్వారా నాగరాజును శనివారం రాత్రి పిలిపించారు. దీంతో, నాగరాజు, గోపి కలిసి బెంగళూరు నుంచి వచ్చారు. అనంతరం డ్యూటీ నిమిత్తం బెంగళూరుకు గోపి వెళ్లిపోయారు. ఆదివారం తెల్లవారుజామున తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం గంగుడుపల్లి వద్ద కారులో నాగరాజు సజీవ దహనమై కనిపించారు. ఆయనను హత్య చేసి కారులో సజీవ దహనం చేశారా? లేక కారులోనే తగలబెట్టారా? అనేది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధి, ఆయన తమ్ముడు పరారీలో ఉన్నారు. చంద్రగిరి సిఐ ఓబులేష్‌ను మీడియా వివరణ కోరగా, ఘటనా స్థలాన్ని పరిశీలించామని, క్లూస్‌టీం ద్వారా విచారణ చేపడుతున్నామని, త్వరలోనే నిందితులను పట్టుకుంటామని తెలిపారు.


వందలాది మందితో గాజువాకలో సాగుతున్న సుబ్బారావు అంతిమయాత్ర

సుబ్బారావుకు కన్నీటి వీడ్కోలు

ప్రజాశక్తి- గాజువాక (విశాఖపట్నం)

సిపిఎం విశాఖ జిల్లా సీనియర్ నాయకులు జి.సుబ్బారావు అంతిమయాత్ర అశేష జనవాహిని నడుమ ఆదివారం సాగింది. వందలాది మంది వామపక్ష కార్యకర్తలు, కార్మికులు, పట్టణ ప్రముఖులు తరలివచ్చి అశ్రు నివాళులర్పించారు. షీలానగర్‌లోని సుబ్బారావు ఇంటి నుంచి చిన గంట్యాడలోని శ్మశాన వాటిక వరకూ అంతిమ యాత్ర సాగింది. ప్రజా నాట్య మండలి కళాకారులు ఆయన సేవలను స్మరిస్తూ గీతాలను ఆలపించారు. తొలుత షీలానగర్‌లో జరిగిన సంతాప సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ జిల్లాలోని వేలాది మంది కష్టజీవులకు ఆప్తమిత్రుడు సుబ్బారావు అని కొనియాడారు. నిత్య శ్రమజీవిని కోల్పోయామన్నారు. కాలనీ ప్రజల సమస్యలపై నిరంతరం స్పందించారని తెలిపారు. నమ్మిన సిద్ధాంతం కోసం కడవరకూ పని చేశారన్నారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ నిజాయితీగల వ్యక్తి సుబ్బారావు అని కొనియాడారు. మాజీ ఎసిపి ఎకె.ఖాన్ మాట్లాడుతూ సుబ్బారావు మంచితనాన్ని గుర్తు చేశారు. స్టీల్‌ప్లాంట్ గుర్తింపు సంఘం నాయకులు డి.ఆదినారాయణ, స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరాం, సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు తదితరులు ప్రసంగించారు. నివాళ్లర్పించిన వారిలో ఎపి మునిసిపల్ వర్కర్స్ అండ్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, రాష్ట్ర నాయకులు ఆర్‌వి.నరసింహారావు, మాజీ ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, చింతపూడి వెంకటరామయ్య, జివిఎంసి అధికారులు, సిబ్బంది, ప్రజా సంఘాల నాయకులు ఉన్నారు. అనారోగ్యం, వయస్సు లెక్క చేయకుండా, కార్మికుల శ్రేయస్సు కోసం సుబ్బారావు రాత్రింబవళ్లు కృషి చేశారని, ఆయన ఆశయ సాధనకు ఫెడరేషన్ కృషి చేస్తుందని కె.ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు.

త్వరలో ఇంధన సామర్థ్య విధానం : సిఎస్ జవహర్ రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రతి ఏటా కనీసం రూ.1200 కోట్ల విలువైన విద్యుత్ ఆదా చేసే లక్ష్యంతో రాష్ట్రంలో ఇంధన సామర్థ్యాన్ని విధానాన్ని రూపొందిస్తామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్ రెడ్డి వెల్లడించారు. త్వరలో జరగనున్న ఎపి ఇంధన పరిరక్షణ మిషన్ కార్యనిర్వాహక కమిటీపై ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్‌తో ఆదివారం జవహర్ రెడ్డి చర్చించారు. ఇంధన సామర్థ్య పాలసీ ద్వారా నిర్దేశించిన ఇంధన డిమాండ్ 67,890 మిలియన్ యూనిట్లలో 25 శాతం ఇంధన పొదుపు సాధించేందుకు దోహదపడుతుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులకు మరింత నమ్మకమైన, నాణ్యమైన విద్యుత్ సరఫరాను అందించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు ఇది అనుబంధంగా మారుతుందని చెప్పారు. రాష్ట్ర డిమాండ్‌లో దాదాపు 17 వేల మిలియన్ యూనిట్ల ఇంధనం ఆదా అయ్యే అవకాశం ఉందని విజయానంద్ వివరించారు. అత్యంత ఇంధన సమర్ధవంతమైన రాష్ట్రంగా అభివృద్ధి చేయడానికి ఇంధన సామర్థ్య విధానం దోహదపడుతుందన్నారు.

స్టీల్‌ప్లాంట్‌పై కెటిఆర్ వైఖరి అభినందనీయం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)



దీక్షల్లో కూర్చున్న స్టీల్‌ప్లాంట్ కార్మికులు

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ఉద్యమానికి మద్దతు తెలిపిన తెలంగాణ మంత్రి, బిఆర్ఎస్ నాయకులు కల్వకుంట్ల తారక రామారావు (కెటిఆర్)కు విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు కృతజ్ఞతలు తెలిపారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 780వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ ఎటిసి విభాగం కాంట్రాక్టు కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ నేతలు ఎం రవి, రామకృష్ణ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ తొలి నుంచి మద్దతు తెలుపుతున్నారన్నారు. అలాగే ఆయన కుమారుడు కెటిఆర్ కూడా ఉక్కు పోరాటానికి నిరంతరం అండగా ఉంటున్నారని తెలిపారు. వారిని చూసైనా ఎపిలోని రాజకీయ నాయకులంతా ఒకే తాటిపై నిలబడి కర్మా గారం పరిరక్షణకు పాటుపడాలన్నారు. మోడీ సర్కారు ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకునేంత వరకూ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

40 మందికి నిరాకరణ!

- పనితీరు ఆధారంగానే టికెట్లు
- ఎమ్మెల్యేల భవితవ్యం తేల్చేలా సమీక్ష
- ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇంచార్జీలతో నేడు సిఎం కీలక భేటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇంచార్జీలు, రీజనల్ కో ఆర్డినేటర్‌లతో సోమవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించే సమీక్షా సమావేశంపై ఆపార్టీలో ఉత్కంఠ నెలకొంది. మరో ఏడాది కాలంలో ఎన్నికలు రానుండటంతో సోమవారం జరిగే సమావేశంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎలాంటి మోహమాటం లేకుండా పోటీ చేసే అభ్యర్థులపై ప్రకటన చేయనున్నారని సమాచారం. ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యేలలో దాదాపు 40 మందికి టికెట్ నిరాకరించనున్నట్లు తెలిసింది. ఇదే విషయాన్ని సోమవారం నాటి సమావేశంలోనే వివరించి..సదరు 40 మంది ఎవరేనేది కూడా తేల్చి చెప్పనున్నట్లు సమాచారం. సాధారణంగా మూడు నాలుగు నెలలకు ఒకసారి నిర్వహించడం పరిపాటి. అయితే ఈ దఫా రెండు నెలలు తిరక్కుండానే సమావేశం నిర్వహిస్తుండటంతో కచ్చితంగా తీవ్రమైన నిర్ణయాలే వెల్లడించే అవకాశముందని వైసిపి శ్రేణుల్లో చర్చ సాగుతోంది.

ఇటీవల జరిగిన శాసనమండలి ఎన్నికల్లో ఎదురుదెబ్బ, అధినేతను కాదని కొందరు వైసిపి ఎమ్మెల్యేల క్రాస్ ఓటింగ్‌కు పాల్పడటం, టిడిపిలో మళ్లీ జోష్ ఊపందుకోవడం వంటి వాటిపై ఈ సమావేశంలో సమీక్షించేవీలుంది. దీంతో పాటు మాజీ మంత్రి వివేకానంద రెడ్డి హత్య కేసులో ఎంపీ అవినాష్‌రెడ్డిపై కేంద్రీకరించి దర్యాప్తు సాగుతుండటం కూడా వైసిపికి ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని కొందరు మినహా మిగిలిన ఎమ్మెల్యేలు ఎవ్వరూ తీవ్రమైన అంశంగా తీసుకోకపోవడం పట్ల కూడా వైఎస్ జగన్ గుర్రుగా ఉన్నట్లు తెలిసింది. వలంటీర్ల స్థానంలో గృహసారధుల నియమకాలు, 'జగనన్నే మా నమ్మకం, మా భవిష్యత్' స్టిక్కర్లు అంటించడం వంటి కార్యక్రమాలు నెమ్మదిగా సాగుతుండటంపైనా ఆయన ఇప్పటికే ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. గడపగడపకు మన ప్రభుత్వంపై గత సమీక్షా సమావేశాల్లో హెచ్చరికలు చేసినా ఎమ్మెల్యేల్లో స్పందన రావడం లేదని, ప్రజల మధ్య లేనివారికి టికెట్‌లు ఇచ్చేది లేదని ఈ సమావేశంలో ప్రకటన చేయనున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఐ-ప్యాక్ టీమ్, రాష్ట్ర ఇంటిలిజెన్స్ ఎమ్మెల్యేల పనితీరుపై రూపొందించిన నివేదిక ఆధారంగా వచ్చే ఎన్నికల్లో బరిలో నిలిపే అభ్యర్థుల జాబితాను సిద్ధం చేస్తున్నట్లుగా తెలిసింది. టికెట్ రాదని భావించిన పలువురు ఎమ్మెల్యేలు ఇప్పటికే వైసిపి పట్ల తిరుగుబాటు బావుటా ఎగురవేసి..ఇతర పార్టీల వైపు చూస్తున్న సంగతి విదితమే. ఈ నేపథ్యంలో శాసనమండలి ఎన్నికల ఫలితాలపై సీరియస్‌గా సమీక్ష చేయనున్నట్లు తేలింది. అలాగే మంత్రుల పనితీరును కూడా సమీక్షించి అవసరమైతే మార్పులు, చేర్పులు చేసే అంశాన్ని కూడా పరిశీలించనున్నట్లు సమాచారం. సోమవారం నాడు జరిగే సమావేశం కూడా గత సమావేశాలకంటే భిన్నంగా ఏర్పాటు చేశారు. గతంలో సాయంత్రం పూట గంట లేదా రెండు గంటలకు మాత్రమే పరిమితమయ్యే సమీక్షా సమావేశాన్ని ఈ సారి ఉదయం 11 గంటలకే ప్రారంభించి సాయంత్రం వరకు కొనసాగించనున్నట్లు సంకేతాలు అందడంతో వైసిపి శ్రేణుల్లో ఈ సమావేశంపై ఎనలేని ఆసక్తి నెలకొంది.

దళిత స్కాలర్లపై మూకదాడి

- ఐదుగురికి గాయాలు
- కాషాయ గూండాల దుశ్చర్య
- మహారాష్ట్రలోని గాంధీ వర్సిటీలో అర్ధరాత్రి ఘటన

ముంబయి : మహారాష్ట్రలో కాషాయ గుండాలు రెచ్చిపోయారు. నిరవధిక దీక్షలో ఉన్న దళిత స్కాలర్లపై దాడికి దిగారు. 'జై శ్రీరామ్' నినాదాలు చేసుకుంటూ వారిని పిడిగుద్దులు గుద్దారు. కులం పేరుతో దూషించారు. ఈ తతంగాన్ని చిత్రీకరిస్తున్న ఇతర విద్యార్థుల మొబైల్ ఫోన్లను లాక్కొని బెదిరించారు. మహాత్మాగాంధీ అంతర్రాష్ట్రీయ హిందీ విశ్వవిద్యాలయ (ఎంజిఎహెచ్‌వి)లో ఈ ఘటన చోటు చేసుకున్నది. ఈ ఘటనలో ఐదుగురు విద్యార్థులు గాయపడ్డారు.

పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు, బాధిత విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం.. పిహెచ్‌డీ స్కాలర్ అయిన రాజ్‌నీశ్ కుమార్ అంబేద్కర్‌తోపాటు అతని సహ విద్యార్థులు ఐదు రోజుల నిరసన దీక్షలో ఉన్నారు. తన పిహెచ్‌డి థీసిస్‌ను మూల్యాంకనం చేయాలనే డిమాండ్‌తో దళిత స్కాలర్ రాజ్‌నీశ్ అంబేద్కర్ ఈ నిరసనను చేస్తున్నాడు. ఈ విషయంలో యూనివర్సిటీ యాజమాన్యం మాత్రం స్పందించలేదు.

విద్యార్థుల మొబైల్ ఫోన్లు లాక్కొని..

శనివారం రాత్రి కొందరు ఆర్ఎస్ఎస్ మూకలు దొంగ చాటుగా క్యాంపస్‌లోకి ప్రవేశించారు. రజనీశ్‌తో పాటు ఇతర విద్యార్థులపై కాషాయమూక దాడికి తెగబడింది. 'జై శ్రీరామ్' అంటూ నినాదాలు చేసింది. ఐదు రోజుల దీక్షను భగ్నం చేయాలని యత్నించింది. నిరసన చేస్తున్న విద్యార్థులపై ఇష్టం వచ్చినట్టు భౌతిక దాడికి దిగింది. ఇష్టం వచ్చినట్టు కొట్టింది. అక్కడ నిశబ్దంగా ఉన్న వాతావరణాన్ని హింసాత్మకంగా మార్చింది. గూండాలు కులం పేరుతో ఇష్టం వచ్చినట్టుగా దూషించారు. ఈ దాడిని తమ మొబైల్ ఫోన్‌లలో చిత్రీకరిస్తున్న ఇతర విద్యార్థులను దుండగులు బెదిరించారు. వారిని ఫోన్లను లాక్కొని వీడియోలు, ఫోటోలను తొలగించారు. ఎవరైనా ఫోటోలు, వీడియోలు తీస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని అక్కడి విద్యార్థులను హెచ్చరించారు.

భద్రతా సిబ్బంది ఉన్నా..

ఈ ఘటన గురించి కొందరు విద్యార్థులు పోలీసులకు తెలపడంతో వారు ఘటనా ప్రదేశానికి చేరుకున్నారు. పోలీసులను చూసిన దుండగులు అక్కడి నుంచి పారిపోయారు. పోలీసులు ఉదయం 4 గంటలకు పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనలో ఐదుగురు విద్యార్థులు గాయపడ్డారని రజనీశ్ అంబేద్కర్ చెప్పాడు. మరికొందరికి స్వల్పంగా గాయాలయ్యాయని తెలిపాడు. ప్రధాన గేటు మూసివేసి ఉన్నదనీ, క్యాంపస్‌లో భద్రతా సిబ్బంది ఉన్నప్పటికీ.. దుండగులు, కొందరు బయటి వ్యక్తులు వర్సిటీ లోపలికి వచ్చి.. క్యాంపస్ లోపల ఉన్న వారికి సంబంధించిన విద్యార్థి సంఘం నాయకులతో కలిసి ఈ హింసకు తెగబడ్డారు.

దాడిని ఖండించిన దళిత సంఘాలు

కుల పక్షపాతం చూపెడుతున్న యూనివర్సిటీకి వ్యతిరేకంగా, తమ డిమాండ్ల సాధన కోసం నిరసన చేస్తున్న దళిత పరిశోధకులు, స్కాలర్లపై ఆర్ఎస్ఎస్ మూకల దాడిని ఖండిస్తున్నట్టు రజ్‌నీశ్ తెలిపారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను డిమాండ్ చేశారు. ఈ దాడిని ఇతర దళిత సంఘాలు ఖండించాయి.

కోటియా గ్రామాలపై కేంద్ర మంత్రి వ్యాఖ్యలు తగవు

- డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు (పార్వతీపురం మన్యం జిల్లా)

ఆంధ్రా-ఒడిశా సరిహద్దులోని వివాదాస్పద కొటియా గ్రామాలు ఒడిశాకు చెందినవేనని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిప్యూటీ సిఎం రాజన్నదొర డిమాండ్ చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులోని తన నివాసంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బిజెపి నాయకులు, ధర్మేంద్ర ప్రధాన్ విచక్షణ కోల్పోయి ఆంధ్రా అధికారులపై మాట్లాడడం తగదన్నారు. ఆంధ్రా-ఒడిశా రాష్ట్రాల మధ్య 21 కొటియా గ్రామాల అనేక ఏళ్లుగా వివాదాస్పదంగా ఉన్నాయని తెలిపారు. 1968లో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రెండు రాష్ట్రాలకు ఆ గ్రామాలపై హక్కు ఉందన్నారు. ఆంధ్ర, ఒడిశాకు చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులు ఆ గ్రామాల్లో పర్యటించవచ్చని తెలిపారు. పరస్పర చర్చల ద్వారా కొటియా గ్రామాల వివాదాన్ని పరిష్కరించుకోవాలని సుప్రీంకోర్టు చెప్పిందని స్పష్టం చేశారు. అయినా.. ఒడిశా అధికారులు, ప్రజాప్రతినిధులు దుందుడుకు వైఖరి అవలంభిస్తున్నారని అన్నారు. కేంద్రమంత్రి వ్యాఖ్యలు సుప్రీం తీర్పు ఉల్లంఘన కిందకు వస్తాయని రాజన్నదొర తెలిపారు. కేంద్ర మంత్రి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అయోమయంలో 'బొండాలు' కొనుగోలు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఈసారి కూడా రబీలో రైతులు బొండాలు రకం వరిని ఎక్కువగా సాగు చేశారు. ధర బావుంటుందని, దిగుబడి ఆశాజనకంగా వస్తుందని దీనిని పండించేందుకే ఏటా ఆసక్తి చూపుతున్నారు. అయితే, బొండాలు రకం ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదు. ఈ ఏడాదైనా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందా? లేదా? అనేది ఇంకా తేల్చి చెప్పకపోవడంతో రైతులు అయోమయంలో ఉన్నారు. కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో ఈ ఏడాది రబీలో 4.36 లక్షల ఎకరాల్లో రైతులు వరిని సాగు చేశారు. ఇందులో 60 శాతం బొండాలు రకమే. ఈ మూడు జిల్లాల్లో ఈ రకం ధాన్యం దాదాపు ఏడు లక్షల టన్నులపై ఉత్పత్తి అవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. తూర్పుగోదావరి జిల్లాలో పలుచోట్ల రబీ కోతలు ప్రారంభమయ్యాయి. కోనసీమ, కాకినాడ జిల్లాల్లో ఈ నెల మొదటి వారంలో ప్రారంభం కానున్నాయి. కాకినాడ జిల్లాలో గతేడాది రబీలో 213 కేంద్రాల ద్వారా 2.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. గతేడాది బొండాలకు మంచి డిమాండ్ ఉండడంతో పెద్ద ఎత్తున సాగు చేశారు. ప్రభుత్వం ఈ రకం ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో రైతులు ప్రయివేటు వ్యాపారులను ఆశ్రయించాల్సి వచ్చింది. ఆశించిన స్థాయిలో ధర వచ్చినా సకాలంలో డబ్బులు చేతికందలేదు. ఈ ఏడాదైనా ప్రభుత్వం బొండాలు రకాలను కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. కనీస మద్దతు ధర ఎ-గ్రేడ్ రకం ధాన్యం 75 కిలోల బస్తాకు రూ.1,545, కామన్ రకం ధాన్యానికి రూ.1,530 ఉంది. కేరళ బొండాలు రకం బియ్యం సరఫరాకు గతేడాది నవంబర్‌లో మన ప్రభుత్వం ఆ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఇది అమలైతే ఎన్ని మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలి, కేరళకు పంపిస్తే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉత్పత్తైన మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేస్తారా? లేదా? అన్నది ప్రస్తుతం ప్రశ్నార్థకంగా ఉంది.

త్వరలో స్పష్టత

ఏప్రిల్ రెండో వారం నుంచి జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రారంభమయ్యే అవకాశముంది. కనీస మద్దతు ధరకు రైతుల వద్ద నుంచి ధాన్యాన్ని సేకరిస్తాం. బొండాలు రకం ధాన్యం కొనుగోలుపై ప్రభుత్వ స్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. త్వరలోనే స్పష్టత వస్తుంది.

- పుష్పమణి, డిఎం, సివిల్ సప్లయిస్, కాకినాడ జిల్లా

డాక్టర్ అచ్చెన్న మృతిపై సమగ్ర విచారణ

- కెవిపిఎస్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కడప పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ అచ్చెన్న మృతిపై సమగ్ర విచారణ జరపాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. డాక్టర్ అచ్చెన్న విధినిర్వహణలో వృత్తిపరంగా వేధించినవారే హత్యచేసినట్లుగా స్పష్టంగా కనిపిస్తున్నా చర్యలు తీసుకోకపోవడం లేదన్నారు. అచ్చెన్న కిడ్నాప్, హత్య, పోస్టుమార్టమ్, పోలీసులు మీడియా సమావేశం అన్నీ అనుమానస్పదంగా వున్నాయని అన్నారు. శవపంచనామా, పోస్టుమార్టమ్ చేసే సమయంలో కుటుంబసభ్యులు వుండాలనే నిబంధనను పోలీసులు ఉల్లంఘించారని తెలిపారు. కుటుంబ సభ్యులకు పోస్టుమార్టమ్ నివేదికను ఇవ్వడం లేదన్నారు. డాక్టర్ అచ్చెన్నది కులదురహంకార హత్యేనని ఈ హత్యకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న బాపయ్య చౌదరి, కెఎస్ లక్ష్మణరావు తదితరులు

26 నుండి అమెరికాలో తెలుగు సంబరాలు

- నాట్స్ అధ్యక్షులు నూతి బాపయ్య చౌదరి

ప్రజాశక్తి-గుంటూరు

అమెరికాలో ఈ నెల 26, 27, 28 తేదీల్లో ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) ఆధ్వర్యాన తెలుగు సంబరాలు నిర్వహించనున్నట్లు నాట్స్ అధ్యక్షులు నూతి బాపయ్య చౌదరి తెలిపారు. ఈ మేరకు గుంటూరులోని ఓ హోటల్లో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, తెలుగు సంబరాల కన్వీనర్ అప్పసాని శ్రీధర్‌తో కలిసి ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతి రెండేళ్లకోసారి నిర్వహిస్తోన్న తెలుగు సంబరాలు ఈ సారి కోవిడ్ వల్ల నాలుగేళ్ల తర్వాత నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రముఖ సినీ నటులు, దర్శకులను కూడా ఈ సంబరాలకు ఆహ్వానించామని, ఉత్తరాంధ్ర నుండి జానపద కళాకారులతో కళాప్రదర్శనలు ఏర్పాటు చేశామని చెప్పారు. సేవే లక్ష్యంగా, తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడానికి 2009లో ఏర్పాటు చేసిన నాట్స్ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున ఉచిత కంటి వైద్యశిబిరాలు, ఆపరేషన్లు, కళ్లజోళ్లు అందజేశామని, రైతుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో చెరువులు, రోడ్లు, పాఠశాలల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ సొంత నేలపై మక్కువతో నాట్స్ చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. శ్రీధర్ మాట్లాడుతూ సహాయం చేయాలనుకునే వారికి, సహాయం పొందాలనుకునే వారికి నాట్స్ ఒక వేదికని పేర్కొన్నారు. ఈ ఏడాది సంబరాలకు సమీకరించే 2.5 మిలియన్ డాలర్లలో 25 శాతం ఛారిటీలకు ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. తెలుగు ప్రజలు ప్రపంచలో ఎక్కడున్నా ఈ సంబరాల విజయవంతానికి సహకరించాలని కోరారు. సమావేశంలో ఎన్ఆర్ఐ పి.చైతన్య తదితరులు పాల్గొన్నారు.

అరసవల్లికి అమరావతి రథం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



అరసవల్లి దర్శనానికి వెళ్తున్న అమరావతి రైతులు

ఆంధ్రప్రదేశ్‌కు ఏకైక రాజధాని అమరావతి అన్న నినాదంతో అమరావతి నుంచి అరసవల్లి వరకు రాజధాని రైతులు చేపట్టిన యాత్ర ఆదివారంతో ముగిసింది. అమరావతి రైతులు చేపట్టిన పాదయాత్ర గతేడాది నిలిచిపోయిన విషయం తెలిసిందే. ఆ యాత్రలో రైతుల వెంట వచ్చిన రథాన్ని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రాపురంలో నిలిపివేశారు. రథాన్ని అరసవల్లి తీసుకెళ్లి పాదయాత్రను ముగించాలని రైతులు నిర్ణయించారు. అందులో భాగంగా శుక్రవారం రథయాత్రను పున:ప్రారంభించారు. రథాన్ని అరసవల్లి తీసుకొచ్చి యాత్రకు ముగింపు పలికారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంతోపాటు నాలుగు బస్సుల్లో సుమారు 300 మంది రైతులు అరసవల్లి చేరుకున్నారు. అమరావతి రైతులకు టిడిపి నాయకులు, సిపిఐ నాయకులు, స్థానికులు స్వాగతం పలికారు. అనంతరం సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని సందర్శించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అమరావతి సాధన సమితి సభ్యులు అప్పారావు మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన తర్వాత రాజధాని ఏర్పాటుకు రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని భూములను ఇచ్చామని తెలిపారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా చేయాలని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మూడుముక్కలాట ప్రారంభించి నాలుగేళ్లుగా కాలక్షేపం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతి నిర్మాణమే తమ ధ్యేయమని స్పష్టం చేశారు.

'అన్నమయ్య కళాక్షేత్రం'... కళాకారుల 'సొంతిల్లు..!

- 'మన ఇల్లు' ప్రారంభోత్సవంలో విజయశంకర్‌స్వామి
- వంట, వార్పు, అన్నప్రసాదతరణ

ప్రజాశక్తి - తిరుపతి



బిటిఆర్ కాలనీలోని అన్నమయ్య కళాక్షేత్రంలో 'మన ఇల్లు' కార్యక్రమం ప్రారంభోత్సవం సందర్భంగా వంటావార్పు చేస్తున్న కళాకారులు

శ్రీవారి దర్శనార్థం తిరుమల, తిరుపతిలో పర్యటిస్తున్న జానపద వృత్తి కళాకారులు తమ సొంత ఇల్లులా 'అన్నమయ్య కళాక్షేత్రాన్ని' వాడుకోవాలని ఆ సంస్థ పీఠాధిపతి విజయశంకర్ స్వామి కళాకారులను కోరారు. తిరుపతి అర్బన్ మంగళం బిటిఆర్ కాలనీలోని అన్నమయ్య కళాక్షేత్రంలో ఆదివారం 'మన ఇల్లు' కార్యక్రమాన్ని ప్రారంభించారు. జానపద వృత్తి కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జగన్మోహన్ రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కళాకారులు తీసుకొచ్చిన సామగ్రితో వంట వండి పెద్దఎత్తున అన్న ప్రసాద వితరణ చేశారు. దీనికి ముఖ్య అతిథులుగా హాజరైన విజయ శంకర్ స్వామి మాట్లాడుతూ ఇన్నాళ్లు ఆధ్యాత్మిక కార్యక్రమాలకు కేంద్రంగా ఉన్న అన్నమయ్య కళాక్షేత్రం నేటి నుంచి కళాకారుల అందరి ఇల్లుగా విరాజిల్లుతుందన్నారు. జానపద వృత్తి కళాకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు మురళి మాట్లాడుతూ... తిరుమల దేవస్థానం అనుబంధ ఆలయాల్లో జరిగే ఉత్సవాలలో ప్రదర్శనలు చేసేటటువంటి భజన బృందాల కళాకారులు సేదతీరి, వారి నైపుణ్యతను మరింత పెంచుకునే విధంగా ఇక్కడ శిక్షణ తీసుకునే అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. జై భారత్ సంస్థ జాతీయ కార్యదర్శి లోకనాథం మాట్లాడుతూ... మన సంస్కృతి, సాంప్రదాయాలకు అలవాలమేటువంటి జానపద కళలను భావితరాలకు అందించేందుకు చేస్తోన్న కషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో జానపద కళాకారుల సంఘం నాయకులు, కళాకారులు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో చేనేతకు గడ్డుకాలం

- ధర్మవరంలోనే 53 మంది నేతన్నల ఆత్మహత్యలు
- యువగళం పాదయాత్రలో నారా లోకేశ్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్, బత్తలపల్లి



నారా లోకేష్‌కు పట్టు వస్త్రాలను అందజేస్తున్న తొగటవీర క్షత్రియులు

వైసిపి పాలనలో చేనేత కార్మికులకు గడ్డు కాలం ఏర్పడిందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ విమర్శించారు. ఆయన చేపట్టిన యువగళం పాదయాత్ర ఆదివారానికి 58వ రోజుకు చేరుకుంది. ధర్మవరం పట్టణం నుంచి ప్రారంభమైన పాదయాత్ర గొట్లూరు, నాగలూరు, వేల్పుమడుగు మీదుగా బత్తలపల్లికి సాగింది. అక్కడ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. చేనేతకు పుట్టినిల్లు ధర్మవరం అని.. దేశంలోనే ధర్మవరం పట్టుచీరలకు మంచి పేరు ఉందని.. జగన్ పాలనలో చేనేత కార్మికులు దుర్భర పరిస్థితిని ఎదుర్కొంటున్నారని అన్నారు. ఒక్క ధర్మవరం పట్టణంలోనే 53 మంది చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. నేతన్న నేస్తం ప్రతి నెలా అందించే దానిపై ఆలోచన చేస్తామని చెప్పారు. జగన్ పాలనలో ఒక్క చేనేతే కాదు అన్ని రంగాలూ దెబ్బతిన్నాయన్నారు. చేనేత వస్త్రాలపై జిఎస్‌టి వేయాలని టిడిపి ప్రభుత్వ హయాంలోనే కేంద్రం ప్రతిపాదన పెట్టిందన్నారు. అప్పుడు కేంద్రంతో మాట్లాడి పక్కన పెట్టించామని తెలిపారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక చేనేత వస్త్రాలపై జిఎస్‌టి వసూలు చేస్తున్నారన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చాక నేతన్నలకు సంక్షేమ పథకాలను తిరిగి అమలుచేస్తామన్నారు. చేనేత వస్త్రాలపై జిఎస్‌టిని ఎత్తివేయించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పరిటాల సునీత, టిడిపి సత్యసాయి జిల్లా అధ్యక్షులు బికె పార్థసారధి, పరిటాల శ్రీరాం, టిడిపి సీనియర్ నాయకులు ఎద్దులపల్లి సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఫలించిన పోరాటం

- కార్మిక సంఘాల ఆందోళనతో దిగొచ్చిన ఆంధ్ర పేపర్ మిల్లు యాజమాన్యం
- మృతుని కుటుంబానికి రూ.22 లక్షల పరిహారం, ఉద్యోగం ఇచ్చేందుకు అంగీకారం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి



కార్మికులతో మాట్లాడుతున్న అరుణ్, ఎంఎల్ఎ రాజా


ఆంధ్రా పేపర్ మిల్లులో కార్మిక సంఘాలు నిర్వహించిన పోరాటం ఫలించింది. యాజమాన్యం దిగొచ్చింది. ఆత్మహత్య చేసుకున్న పర్మినెంట్ కార్మికుడు సత్యనారాయణ కుటుంబానికి నష్టపరిహారం అందించేందుకు అంగీకరించింది. కార్మికుని కుటుంబానికి రూ.22 లక్షలు పరిహారం అందించడంతోపాటూ ఆయన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చేందుకు ముందుకొచ్చింది. కార్మికుని ఆత్మహత్యకు కారణమైన వారిపై కేసు నమోదు చేసేందుకు కలెక్టర్, పోలీసులు హామీ ఇవ్వడంతో కార్మికులు ఆందోళన విరమించారు.

కార్మికుని ఆత్మహత్య సమాచారం తెలుసుకున్న ఎపి పేపరు మిల్లు స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు టి.అరుణ్, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పేపరు మిల్లు వద్దకు చేరుకున్నారు. మృతుని కుటుంబానికి భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం చర్చలకు రాకపోవడం, కనీస భరోసా కల్పించకపోవడంతో అక్కడే బైఠాయించి ఆందోళనకు దిగారు. శనివారం సాయంత్రం ఆరు నుంచి ఆదివారం ఉదయం ఆరు గంటల వరకు టైం ఆఫీస్ గేట్ వద్ద కార్మిక సంఘాలతో కలిసి ఆందోళన చేశారు. కార్మికుల ఆందోళనతో ఎట్టకేలకు యాజమాన్య ప్రతినిధులు ప్రొడక్షన్ హెడ్ అశోక్ సింఘాల్, ఎపిఎల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జూరారెడ్డి, డిజిఎం శ్రీనివాస్ చర్చలకు వచ్చారు. ఈ చర్చల్లో పేపరు మిల్లు స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు టి.అరుణ్, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, పలువురు సిఐటియు నాయకులు పాల్గొన్నారు. సబ్ కలెక్టర్ యాజమాన్యంతో ప్రత్యక్షంగా మాట్లాడారు. దీంతో నష్టపరిహారం, ఉద్యోగం ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకరించింది. ఈ ఆందోళనలో సిఐటియు నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, ఎస్‌డబ్ల్యుడబ్ల్యుఎ నాయకులు కె.రాజేష్, కెవై.దాస్, ఎఐటియుసి ఎం.కృష్ణ, చైతన్య కార్మిక సంఘం నాయకులు ఎల్.అప్పారావు, ఇతర సంఘాల నాయకులు కాంతారావు, నాగేశ్వరరావు, ఎ.సత్యనారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అక్షరం

ప్రజాశక్తి
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti

4 | విజయవాడ
సోమవారం 3 ఏప్రిల్ 2023



పుస్తకాలు నా మనస్సుకూ,
హృదయానికీ
రెక్కలనిచ్చాయి. నేను బురద నుంచి
బయటపడటానికి ఎంతో తోడ్పడ్డాయి.
పుస్తకాలు చదవకపోతే నా
చుట్టూవున్న మౌఢ్యంలోనూ,
నీచంలోనూ మునిగి పోయి వుండేవాడ్ని. విశాలమైన
ప్రపంచ దృశ్యాలను పుస్తకాలు నా ముందు పరిచాయి.
– మాక్సిం గోర్కీ

రగులుతున్న అక్షరాల కొలిమి నెమిలేటి

పుస్తకం

నెమిలేటి కిట్టన్న చిత్తూరు జిల్లా పడమటి మండలాల కరువు కాటకాల ఆకలి నెగళ్ళ సెగల తాకిళ్ళని తట్టుకోలేక వెర్రి పరుగులు తీసి వచ్చిన మట్టి మనిషి. పల్లె పెత్తందారీల అసూయల మంటల్లో పొగచూరిపోయి ఎలాగో అక్షరాల మలాము రాసుకుని కురుపుల్ని మాన్పుకుని బతికి బట్టకట్టిన గట్టి పిండం. భూస్వామ్య వ్యతిరేక పోరాటంలో అడవులని ఆశ్రయించి, ఆ తరువాత జనజీవన స్రవంతిలో కలిసిపోయిన ప్రజాకవి. కిట్టన్న కవిత్వం ప్రజల పక్షంలోనే ఉంటుంది. ప్రజల గొంతుకై వినిపిస్తుంది. ఈ నేపథ్యంలో వచ్చి రగులుకొన్న ఆయన తాజా కవిత్వం 'అక్షరాల కొలిమి' చర్చనీయం.

నెమిలేటి కవిత్వంలో ఎడారి అడవుల్లో మండుటెండల్లో ఎండి, కార్చిచ్చుల్లో మండి, బతికి బట్టకట్టిన ఆ చిగరచెట్టుకున్న చేవలాంటి ముతకతనం కనిపిస్తుంది. 'తొలకరి చినుకుల్లో తడిసిన/ మట్టి పరిమళం అమ్మ' 'నీ బాధనంతా తన మనసుతో తడిమిన తల్లి' అన్న మాటలు, తల్లిదండ్రుల్ని అక్షరాల సీతాకోకచిలుకలుగా చేసిన ఊహ అతని భావుకత్వపు లోతుల్ని తెలియజేస్తాయి. అందరూ నటసార్వభౌములే పద్యం కవి మనిషిని ఎంతగా చదివేశాడో తెలియజేస్తుంది. మనిషిలోని మృగాలని వ్యంగ్య బాణాలతో కొట్టి చంపేస్తుంది. రాజ్యం దాని ప్రతినిధులు తమ ఇష్టం వచ్చినట్లు అరాచకాలు చేస్తుంటే ఎవరు పెదవి విప్పకున్నా అక్షరాలు ఊరుకోవని, అవి మాట్లాడుకొని ఆ వినాయకులను గద్దె దించుతాయని, రాజకీయ పెత్తందారీ తనానికి అంతిమ సంస్కారం చేస్తాయని ధైర్యంగా హెచ్చరిస్తాడు నెమిలేటి. ప్రజల సొత్తైన విశాఖ ఉక్కును పరులపరం చేస్తే ఉక్కు పిడికిళ్ళు బిగుస్తాయని హెచ్చరిస్తున్నాడు.

నెమిలేటి అక్షరాల కొలిమిని చేతిలో పట్టుకుని పద్యాల్ని చదివి పక్కన పెడితే ఒళ్ళంతా కొలిమివద్ద చలి కాచుకున్నప్పటి కమురువాసన కొడుతుంది. అలా ఒక మార్మికమైన వింత అనుభవం కలుగుతుంది. ప్రపంచీకరణ నేపథ్యంలో సేద్యం జవసత్వాల్ని కోల్పోయింది. పల్లెని పుడమితల్లిని నమ్ముకున్న భూమిపుత్రులు తమ నమ్మకం వమ్ముకాగా వలసలెత్తి నగరాలకు వెళ్ళిపోయారు. ఇప్పుడు జనాల్లేక మాటల్లేక బంధుత్వాల్లేక ఆప్యాయతల్లేక ఆదుకునేవాళ్ళు లేక పరిచితుల్లేక ఒకప్పటి ఆనవాళ్ళు కూడా లేక పల్లె ఒక జ్ఞాపకాల చెట్టుగా మిగిలిపోయిందని నెమిలేటి బాధపడతాడు. గ్లోబలైజేషన్ ప్రక్రియలో బహుళ అంతస్థుల భవనాలు లేస్తున్నాయి. పూరింఢ్ల సంస్కృతి కనుమరుగైపోతున్నది. ఒకప్పుడు ఇంటికి వెన్నై నిలిచిన నిట్రాయి లాంటి వాటినీ మరిచిపోతున్నాం. "నేనురా నీ పూరిగుడిసె నిట్టాడునురా, అప్పుడే మరిచిపోతివేమప్పా" అని దాన్ని మనతో మాట్లాడిస్తాడు కవి. గతం పునాదులపై వివేకంతో కూడిన భవిషత్తును నిర్మించుకోవాలన్న సందేశం అందులో కనిపిస్తుంది. కరోనా



సమయంలో ఇలాంటి రోజొకటి వస్తుందనుకోలా అంటున్నపుడు కూడా "కులం కుంపటి నెత్తిన పెట్టుకొని ఊరేగినోడా/ మతం మత్తుమందు/ నరనరాన నింపుకున్న వాడా/ యాడబాయరా నీ కులం, నీ మతం/ కరోనా కాటుకు వ్యాక్సిన్ వస్తుందని చెప్పగలను/ నీ కులం భూతాల్ని అంతం/ చేసే మానవీయ లేపనం/ తయారు చేసే మొనగాడెక్కడ?" అని సామాజిక స్పృహని ప్రదర్శిస్తాడు.

మామూలు మాటల్లో సాదాసీదాగా చెప్పినా 'చివరి వీలునామా రాసుకుందాం' పద్యంలో సాటి వ్యక్తులైన స్త్రీలపై అత్యాచారాలకు పాల్పడకుండా ఒక ఒప్పందంలా కట్టుబాటు చేసుకుందాం అన్న కవి వాక్యాలు అతని హృదయ స్వచ్ఛతని తెలియజేస్తాయి. స్త్రీల పట్ల తనకున్న అనుకంపనీ గౌరవ భావాన్నీ వెల్లడిస్తాయి. 'జీవకారుణ్యం లేని నువ్వు/ ఒట్టి బండరాయివి కదరా' అంటూ ప్రకృతి పట్లా ప్రకృతి ఆనవాళ్ళైన వృక్షజాతుల పట్లా, జంతుజాలం పట్లా బాధ్యత కలిగి మసలుకోమంటాడు. చెయ్యరాని అన్యాయాలూ అణచివేతలూ చేస్తూ ఏ వైరుధ్యాలూ లేవు కలసిపోదాం రమ్మని పిలిస్తే ఎట్లా రమ్మంటావని పెత్తందారీ కులాలవాళ్ళని నిలదీస్తాడు.

'దుర్మార్గపు ఖడ్గాన్ని చేతబట్టిన వాడ్ని/ నీ మధురకవిత్వం మారుస్తుందా?' అని కవి కవిత్వపు శక్తిని శంకిస్తాడు. అమెరికాలో జార్జి ఫ్లాయిడ్ అనే నల్లజాతీయుడి ప్రాణాల్ని శ్వేతజాతి దురహంకారం బలిగొన్నపుడు కడుపుమండిన కవి 'నలుపంటే శ్వేతసౌధంపై/ రపరెపలాడిన విజయపతాకం/ నలుపంటే జాత్యహంకారాన్ని/ నిలువునా నరికే గండ్రగొడ్డలి...' అంటూ ఎమోషనల్‌గా ఇచ్చిన నిర్వచనాల సమాహారాన్ని చదివితీరాలి.

నెమిలేటికి పరకాయ ప్రవేశం చేసే విద్య కూడా బాగా తెలుసు. నా అంతరంగ మందిరం కవితలో ఒక శృంగార శ్రామికలోకి ప్రవేశించి కైపెక్కించే కళ్ళతో కసిగా/ నా కాటుక కన్నులనే చూశాడు/ తప్ప కాళరాత్రుల రుచులతో/ అలసిపోయిన నా మనోనేత్రాన్ని చూడలేదెవడూ/ వాడు నా నుండి తృప్తిని/ కొల్లగొట్టి బోనసుగా ఇచ్చిన/ రోగగ్రస్త జీవితం నాది' అని ఆర్తితో అన్న మాటలు కదిలించివేస్తాయి. కరోనా కష్టకాలంలో పాలకుల నిర్లక్ష్యవైఖరిని ఎండగడుతూ 'శవాల గుట్టల మధ్య కూర్చొని/ కమురు వాసన ఆస్వాదిస్తూ కునుకు తీస్తున్నాడు/ రోగిష్టి భారతాన్ని/ కలలు కంటూ/ భవిషత్తు ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్న వేళ/ నా దేశానికి జ్వరం వచ్చింది' అని చురకలేస్తాడు. నెమిలేటి శ్రమసంస్కృతిని ఇష్టంగా హత్తుకుంటాడు. 'తనువంతా శ్రమసుగంధం పూసుకున్న/ తూర్పున ఉదయించిన సూర్యుడు నాన్న' అని వర్ణించడంలో శ్రమపై తనకున్న అమితమైన గౌరవం ద్యోతకమవుతుంది. రాయలసీమలో బతుకు ఛిద్రం కావడానికి హేతువుల్ని ఏకరువు పెట్టి వాటిని చూసి తనలో బాధల ముల్లు చెట్టయి మొలిచిదంటున్న నెమిలేటిలో ప్రాంతీయ అస్తిత్వప్రీతి కూడా మెండుగానే కనబడుతుంది.

'పరిమళించిన పద్యం'లో కవిత్వ తత్వాన్ని కూడా ప్రస్తావించాడు ఈ కవి. తన కవిత్వం ఉబుసుపోక కోసం రాసేది కాదు. అది చైతన్యస్ఫోరకం. గుణాన్నీ తెలుగుదనాన్నీ ఆపాదించి చెప్పిన ఆ పద్యం నిజంగానే పరిమళిస్తోంది. బీజాక్షరాలై మొలుద్దాం, ప్రకృతిమాతా వర్ధిల్లవమ్మా, భూమి నా భావావేశం, మా ఊరికి రాజధానొచ్చింది కవితల్లో ప్రకృతిపై ప్రేమతో బాటు సమస్త శుభాలనూ వృక్షాలతో కూడిన ప్రకృతే ప్రసాదిస్తుందని, ఆ ప్రకృతిని ప్రాకృతికమైన విపత్తులనుండి, కబ్జాకోరుల నుండి కాపాడుకోవాలని పిలుపునిస్తాడు. 'మట్టిని ధ్వంసం చేసినవాడు/ మట్టి గొట్టుకు పోతాడంతే' అని తీవ్రస్వరంతో శపిస్తాడు. మట్టిని నమ్ముకున్న రైతులు ప్రపంచీకరణలో, సెజ్జుల జాతరలో, రాజధాని భూసేకరణల్లో భూమిని కోల్పోయి కార్పొరేటు కంపెనీల వద్ద బానిసలుగా మారడాన్ని చూసి, పచ్చని పంటభూములు కాంక్రీటు జంగిల్లుగా మారిపోవడం చూసి ఆక్రోశిస్తాడు. ఒక గురువుగా నెమిలేటి బాలల్ని ఎంతో ఇష్టపడతాడు. కరోనా కాలంలో వాళ్ళకి దూరమై బడిలేక బాల్యం ఏమవుతున్నదోనని పదేపదే

ఆందోళన చెందుతాడు. మనువు వారసులు మళ్ళీ పేట్రేగి దేశాన్ని కులం మంటల్లో తగులబెడుతున్నారని, దేశ మూలవాసుల ఆనవాళ్ళని చెరిపేసే ప్రయత్నం చేస్తున్నారని, దేశీయుల్ని పరదేశీయులుగా చిత్రిస్తునారని, ప్రశ్నించే హక్కును కబ్జా చేస్తున్నారని, ఏం తినాలో ఏం తాగాలో కూడా వాళ్ళే నిర్దేశిస్తున్నారని ... అలాంటి కుహనా దేశభక్తులకు బుద్ధి వచ్చేలా మన జెండాను నిండుగా ఎగురనిద్దాం అంటున్నాడు నెమిలేటి. నెమిలేటి అక్షరాల కొలిమి టైటిల్ పద్యం కవి ఎందుకు అక్షరాల కొలిమై రగిలిపోతున్నాడో లోతుగా సూటిగా చెబుతుంది. 'నా పూర్వీకుల ముద్రలు చెరిపేసిన రోజే/... మా నానమ్మ చెప్పిన/ బ్రహ్మం గారి తత్వాల సాక్షిగా/... ఎవడో పనిగట్టుకుని ఏక శరీరంలాంటి/ మా ఉమ్మడి కుటుంబాన్ని చాలా శ్రద్ధగా/ నిలువునా చీల్చి/ నా వెన్నెల/ బాల్యంలో చీకట్లు నింపి/ నన్ను బడికి దూరం చేసినప్పుడే/... మా ఊరి కరణం దగ్గరకు వెళ్ళి/ నా కులం సర్టిఫికెట్ ఇమ్మంటే/ నవ్వు చదువుకుంటే/ నాకేమొస్తుందని ప్రశ్నించిన/ వాడి నాలుగెకరాల ఎర్రనేలలో/ మేడిపట్టి దుక్కి దున్నిన/ నా రెండు చేతులు/ బొబ్బలెక్కినప్పుడు/... మా వూరి జుట్టుసామి/ కులంతక్కవోడికి నీకు చదువెందుకురా? అంటూ/ చదువుకుంటే బొత్తిగా చెడిపోతావురా అన్నప్పుడు/... ఆటపాటలతో ఉల్లాసంగా/ సాగుతున్న నా చదువు/ ఉన్నపళంగా డ్రాపౌట్ విద్యార్థిని చేసినప్పుడు/ రెండు సంవత్సరాల పాటు/ మా మడిచెక్కలో/ అడుసు తొక్కే మట్టి పాదాన్నైనప్పుడు/... మా భాగానికొచ్చిన/ నాలుగు కొండ్రల నేలలో/ వేరుసెనగ విత్తునై మొలిచి/ పూతకొచ్చేవేళకు కురవని/ మొండి జీమూతల్ని జూచిన/ అమ్మానాన్నలు/ చేసిన అప్పు తీర్చడానికి క్వారీలో కంకర రాళ్లైనప్పుడు/ నాలో రగులుకొంది కొలిమి' అంటాడు కవి. అలా తన బాల్యం చుట్టూ ఆవరించిన తమ నిస్సహాయతల్లోంచి, అవమానాలు అణచివేతలు కుట్రలపై పుట్టిన కసిలోంచి ఆ అక్షరాల కొలిమి రగులుకున్నది. "అది మామూలు కొలిమి కానేకాదు/ ఈ అసమ సమాజాన్ని అంటుకున్న/ సకల రుగ్మతలను/ నయంచేసే దివ్యౌషధాన్ని/ పుక్కిటబట్టి ఊదుతున్న కొలిమి" అని కవే స్పష్టం చేస్తాడు. అది అసలుసిసలు సృజనకారుడి ప్రతిజ్ఞ. నెమిలేటి కావ్యం పొడుగునా ఎక్కడా పట్టుసడలకుండా చిక్కగా అల్లగలిగిన మరీ కవిత్వపు లోతుల కిటుకులు తెలిసిన నెరజాణ కాకపోవచ్చు. కానీ తన నేపథ్యం నుంచి పుట్టిన తనలోని కసి ఆయన వాక్యాలకు కత్తివాదరనిచ్చింది. తనని ప్రగతిశీలవాదిగా ప్రజాతంత్రవాదిగా సమరశీలిగా ప్రజాకవిగా చేసింది. అలా కొలిమిలా రగులుతున్న నెమిలేటి కిట్టన్న కవిత్వాన్ని స్థానిక సాహితీ సమాజాలు గుర్తించకపోవడంలో పెరటిచెట్టు వైద్యానికి పనికిరాదన్న నిర్లక్ష్య వైఖరి కనబడుతుంది.

– కవితశ్రీ

మధురమైన గజల్ల సవ్వడి

తెలుగు సాహిత్యంలో ఎన్నో ప్రక్రియలు పిల్ల కాలువల్లా, సెలయేరుల్లా, నదుల్లా ఈనాడు ఉరుకులు పరుగులతో ప్రవహిస్తున్నాయి. ఈమధ్య బాగా వినిపిస్తున్న ప్రక్రియ పేరు గజల్. గజ్జలు కట్టుకుని మరి ఘల్ ఘల్‌మని నడుస్తోంది గజల్ సుందరి. పరాయి భాష నుంచి వచ్చినా తెలుగు భాషలో కాస్త ఒదిగి, కాస్త స్వతంత్రతను అద్దుకుని మరీ అన్ని సభలూ సమావేశాల్లో తన గొంతుకను స్వేచ్ఛగా, మధురంగా వినిపిస్తోంది. ఇదేమంత తేలికైన ప్రక్రియ కాదు. అలా అని రాయలేక పోయేంత కఠినమూ కాదు. గజల్ నాడి పట్టుకున్నాక రోజుకు ఒక్క గజలైన రాయకుండా ఉండలేని స్థితికి వస్తారు గజల్ కవులు.

గజల్ ప్రక్రియలో రాసేటప్పుడు ముఖ్యంగా తీసుకోవల్సిన అంశం ప్రేమ, విరహం, తాత్వికత. ఈ భావాలను పలికించాలంటే కాస్త భావుకత్వం అక్షరాలకు అద్దాలి. జ్ఞాపకాలను కాస్త ఓపిగ్గా తవ్వి తీయాలి లేదా గొప్పగా ఊహాశక్తి అయినా ఉండాలి. ఈమధ్యన గజళ్ళలో సామాజిక అంశాలు, భక్తి గీతాలు కూడా వస్తున్నాయి. గజళ్ళు మనం ఇతరులతో సంభాషిస్తున్నట్లు ఉండాలి. అంటే ఎవరికో ఒకరికి మనం చెబుతున్నట్లు ఉండాలి. మనం రాసిన గజల్‌కు గాన యోగ్యత ఉండాలి. అంటే లయాత్మకంగా ఉండాలి. మృదువైన భావాలు మెల్లమెల్లగా సాగుతూ ఆ నడకలో లయ వినిపించాలి. పాఠకుల మనసులో చెరగని ముద్ర వేయాలి. వీటితో పాటుగా రధీఫ్, కాఫియాల నియమాలను, మాత్రా ఛందస్సును పాటించాలి. ఎంత స్వతంత్రంగా రాసినా కూడా మూలంలో ఉన్న నియమాలను పూర్తిగా గట్టున పెట్టకూడదు కదా... అప్పుడు అది గజల్ అని మనం మాత్రమే చెప్పుకోవలసి ఉంటుంది. గజల్ అంటే చాలా సున్నితంగా అక్షరాలు చదువుతుంటేనే మనసులో బాణీ కట్టేలా అతి రమ్యంగా ఉండాలి.

నా దృష్టిలో గజల్ అంటే ....

"గొంతు దాటిరాని గుండె ఊసులేవో
అక్షరమై కళ్ళముందు మెరవడమే...
మనసులోని ఆర్ద్రత కరిగి కరిగి ఓ హిమనదంలా
కాగితాన్ని ప్రేమగా తడపడమే..."

రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ బాగా గజళ్ళు రాస్తున్న వారిలో శ్రీమతి విజయ గోలి కూడా ఒకరు. ఫేస్బుక్‌మాధ్యమం లో ప్రతిరోజూ ఓ కొత్త గజల్‌తో ఉదయానికి స్వాగతం పలకడం ఆమె దినచర్యలో భాగం. గజళ్ళు మాత్రమే కాకుండా వచన కవిత్వం, అప్పుడప్పుడు కథలు కూడా రాస్తుంటారు. తెలుగు సాహిత్యంపై ముఖ్యంగా గజళ్ళ పైన మక్కువ ఎక్కువ అనే చెప్పాలి. గత ఏడాది మొదట వచన కవితా సంపుటి తరువాత ఒకేసారి రెండు గజళ్ళ సంపుటాలను ఆవిష్కరణ గావించారు. అవి : పిల్లన గ్రోవి, చిత్రవీణ. ఈ రెండు సంపుటాలకు ముఖ చిత్రాలు, రేఖా చిత్రాలు ప్రముఖ





చిత్రాకారులు 'కూచి' వేయడం అదనపు ఆకర్షణ.

'పిల్లన గ్రోవి'లోని గజళ్ళు పాఠకుల హృదయాలను తన్మయత్వానికి గురిచేస్తాయి. సుమారు 47 గజళ్ళతో ఈ రాధా మాధవీయాన్ని 'పిల్లన గ్రోవి'గా మన ముందుంచారు.

" కన్నులలో కార్తీకం వెలుగులాయె కమనీయం
కొలనులోని దీపాలే కలువలాయె కమనీయం"

పై మత్లాలో కన్నుల్లో వెలుగులు కార్తీక దీపాలుగా ప్రకాశిస్తే కొలనులో వదిలిన దీపాలేమో కలువల్లాగా శోభిస్తున్నాయని మనకో చక్కటి దృశ్యాన్ని చూపెడతారు.

" వెదురు పుల్ల రాగాలే వినిపించెను మధురముగా
నిను తాకిన ఆనందం నినదించెను మధురముగా"

ఈ మత్లాలో నీ మేను తాకితే కలిగే ఆనందం వేణువు వినిపించిన రాగమంత మధురమని మనోహర వర్ణన.

"పెదవులపై నీ నామమె పల్లవించు ప్రణవముగా
విశ్వమంత నీ రూపమె అగుపించెను మధురముగా"

ఎటు చూసినా నీ రూపమే ఏ శబ్దమైన నీ నామమే అనడంలో అలౌకికమైన ప్రేమ దాగుంది.

"కనులు మూసి తలచితివా నీ కలలో నేనుంటా
మనసు తట్టి పిలిచితివా మాటలలో నేనుంటా"

కళ్ళు మూసి నిదురించే వేళ కలవై, కనులు తెరచి మెలకువగా ఉంటే మాటవై... నువ్వు తప్ప వేరే ఏమీ లేదు ఈ జగతిలో అంటారు.

"పూల బాస తెలుసుంటే పువ్వులాగ నవ్వేవు
మనసు భాష ఎరిగుంటే మౌనాన్నే వీడేవు"

ఈ కవయిత్రి అన్నట్లు పూల బాసలు, మనసు భాషలు రెండు తెలియాలి ప్రేమలో. అపుడే పువ్వులాగా నవ్వడం మౌనానికి సెలవివ్వడం తెలుస్తుంది. ఇక్కడ అన్ని మత్లాల్లోనూ మనకు రసాత్మకమైన ప్రేమ కనిపిస్తుంది. రధీఫ్‌తో పోటీపడుతూ కాఫియాలు ఈమె గజళ్ళ నిండా కనిపిస్తాయి. ఈ సంపుటిలో అష్టవిధ నాయికలపై రాసిన ఎనిమిది గజళ్ళు ఉన్నాయి.

'చిత్రవీణ'లో మొత్తం 56 గజళ్ళు ఉన్నాయి. ప్రతి ఒక్క గజల్ ఓ ప్రేమ ధార. ఉదాహరణకు కొన్ని మత్లాలు చూడండి.

"చిత్రవీణ పాడినదీ చైత్రవర్ణ రాగాలే
వనమంతా ఆలపించె వలపు సిరుల గానాలే!"

చిత్రవీణ స్వరాలలో వనమంతా వర్ణాలను అద్దుకోవడమే కాకుండా వలపు సిరులను కూడా వనాలకు పంచుతాయంటూ మనల్ని ఓ ఆహ్లాదకరమైన ప్రకృతిలోకి తీసుకుని వెళ్తారు.

"ఒక్క నవ్వు కానుకగా ఇవ్వలేవ ఒక్కసారి
కలనైనా నీరూపును చూపలేవ ఒక్కసారి"

ఒక నవ్వు నవ్వడానికి ఏమంత కష్టం. అలాగే కలలోకి రావడానికి కూడా... అంటూ సున్నితంగా అడుగుతున్నట్లు ప్రేమగా మందలిస్తున్నట్లు ఉందీ మత్లా.

"మనసెందుకొ గమ్మత్తుగ గగనవీధి తేలుతుంది
ఏమైనదొ తెలియకుంది ఎదచప్పుడు పెరుగుతుంది"

ఎందుకో గుండె చప్పుడు వేగం పెరుతోంది. అలాగే మనసు కూడా ఆకాశంలో తేలుతోంది. పరిపరి విధాలుగా మనసులోని అలజడులు, ఆనందాలు ప్రేమలో సాధారణమైనవే!

"గుసగుసగా ఊసులేవొ చెబుతుంటే బాగుంటది
గాలికున్న చెవులేవో వినకుంటే బాగుంటది"


ఈ మత్లాలో గమ్మత్తయిన భావన వింటుంటే ఎంతో బాగుంది కానీ ఈ పాడు గాలి మాత్రం వినకుంటే బాగుంటుంది. లేకుంటే ఈ గాలి వీచినంతమేర గుసగుసలు గుప్పుమంటాయి అనడం గమ్మత్తే కదా!

"జ్ఞాపకాల పుటలలోన నెమలీకే నా చెలియ
అగరుపూల నెత్తావుల సౌగంధికే నా చెలియ"

చెలి జ్ఞాపకాలు ఎంత మధురమైనవో ఎంత పరిమళ భరితమో రసాత్మకంగా వినిపిస్తుంది ఈ మత్లాలో!

ఈ కవయిత్రి తన గజల్ రచనలతో ఇలాగే సాగిపోవాలి; సరికొత్త రాగాలు పలికిస్తూ, చైత్ర వీణలా ప్రతి మదిలో పువ్వుల పరిమళాలను కురిపిస్తూ. గజళ్ళు మాత్రా ఛందస్సుతో రాయడం ఒక ఎత్తైతే లయబద్ధంగా శ్రోతల మనసు దోచుకునేలా రాయడం మరో ఎత్తు.. ఈ రెండు ఎత్తులను తన గజళ్ళలో నింపుకుని ఏకధాటిగా రాస్తున్న కవయిత్రి విజయగోలి. ఈ 'చైత్రవీణ', 'పిల్లన గ్రోవి' మంచి ప్రాచుర్యం పొందాలని ఆకాంక్షిద్దాం.

– శాంతికృష్ణ
95022 36670



లెక్కలు

ఎక్కాల బుక్కుగా మారిన
బతుకు పుస్తకంలో
ఎటు చూసినా లెక్కలే లెక్కలు
నిక్కరు తొడిగిన వయసు
నుండే
రెక్కలు చాచిన లెక్కలు
స్వలాభం బట్టే స్నేహం
లెక్కలు
వరకట్నం బట్టీ వివాహం
లెక్కలు
కొలతల మేరకు పలకరింపులు
కేలరీలు చూసీ ఆరగింపులు
అక్కర మేరకు చుట్టరికాలు
గుంపుల బట్టే గుణకారాలు
బంధంలోనూ భాగహారాలు
పదును తేలిన తెలివి తేటలతో
అదును తీరితే అన్నీ తీసివేతలు
కూడికలు లేని కుటుంబాలు
కన్నవారిని చేరదీసే
చిన్నపనికీ వంతులు..
వాటాలు... బేరీజులు
మిత్రమా,
లెక్కల్నీ, చిక్కుల్నీ ఓ పక్కన
పడేద్దాం
సహజంగా నవ సమాజంగా
జీవిద్దాం
జీవిత పర్యంతమూ ప్రేమిద్దాం
జీవన సౌందర్యాన్ని రుచి
చూద్దాం!

– డా. డి.వి.జి.శంకర రావు,
మాజీ ఎంపీ,
94408 36931

వి.మల్లికార్జున్‌కి
డాక్టర్ వి.చంద్రశేఖరరావు సాహిత్య పురస్కారం

తన ప్రత్యేక శైలితో కథ, నవలా ప్రపంచాన్ని అబ్బురపరచిన విలక్షణ రచనాశీలి డాక్టర్ వి.చంద్రశేఖరరావు మరణించి ఆరు సంవత్సరాలు కావస్తోంది. ఏప్రిల్ 13 వారి జయంతి సందర్భంగా ఏటా వర్ధమాన సాహిత్యకారునికి ఆయన పేరున సాహిత్య పురస్కారాన్ని చంద్రశేఖరరావు సాహితీ కుటుంబం ప్రదానం చేస్తోంది. 2023 సంవత్సరానికి గాను ఈ పురస్కారాన్ని నల్గొండకు చెందిన యువ కథా రచయిత వి.మల్లికార్జున్‌కి ప్రదానం చేయాలని నిర్ణయించారు. గతంలో ఈ పురస్కారాన్ని ఎండపల్లి భారతి, సుంకోజి దేవేంద్రాచారి, ఇండ్ల చంద్రశేఖర్, దుగ్గినపల్లి ఎజ్రా శాస్త్రి పొందారు.

– డాక్టర్ వి.ప్రసూన,
డాక్టర్ వి.చంద్రశేఖర రావు సాహిత్య కుటుంబం

డా.వాసా ప్రభావతి స్మారక కవితల పోటీ

దేశభక్తి – పురోగతి – జాతీయత ప్రధానాంశాలుగా కవితల పోటీ నిర్వహించాలని పాలపిట్ట – వాసా ఫౌండేషన్ సంకల్పించాయి. సుప్రసిద్ధ సాహితీవేత్త డా. వాసా ప్రభావతి సంస్మరణార్థం నిర్వహించ తలపెట్టిన ఈ పోటీకి అమృతోత్సవాల సందర్భమే ప్రధాన వస్తువు. రూ. 3 వేలు, రూ.2 వేలు, రూ. వెయ్యి చొప్పున ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఉంటాయి. రూ.500 చొప్పున 8 ప్రత్యేక బహుమతులు ఉంటాయి. దేశభక్తిని పెంపొందించే అంశాలకు ప్రాధాన్యం కుల, మతాల విభేదాలని మరచి శాంతి సామరస్యాలతో ప్రజలంతా పురోగామిపథంలో ప్రయాణించాలన్న భావనలకు బలం చేకూరే అంశాలు వస్తువుగా ఉండటం ఉపయుక్తం. వచన కవితలు ఎన్ని లైన్లయినా ఉండొచ్చు. కవితలు పంపించడానికి చివరి తేదీ : 30 ఏప్రిల్ 2023. పంపించాల్సిన చిరునామా : ఎడిటర్, పాలపిట్ట, ఫ్లాట్ నెం: 2, బ్లాక్–6, ఎం.ఐ.జి–2, ఏపిహెచ్‌బి, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్–500 044. ఫోను : 94900 99327. palapittamag@gmail.com

కలిమిశ్రీకి జాషువా పురస్కారం

బహుముఖీనంగా తెలుగు సాహిత్యానికి సేవలందిస్తున్న కలిమిశ్రీకి పద్మభూషణ్ గుర్రం జాషువా స్మారక కళాపరిషత్ 35వ వార్షికోత్సవ వేడుకల్లో మహాకవి జాషువా పురస్కారం అందజేయనుంది. ఏప్రిల్ 23న తెనాలిలో జరిగే వేడుకల్లో కలిమిశ్రీని 'సాహితీ తపస్వి' బిరుదుతో సత్కరించనున్నట్టు జాషువా స్మారక కళాపరిషత్ వ్యవస్థాపక అధ్యక్షులు డా. పెద్దింటి యోహాన్ తెలిపారు. కలిమిశ్రీ అసలు పేరు కలిమికొండ సాంబశివరావు. ఆంధ్రపత్రిక, ఆంధ్రజ్యోతి, జ్యోతిచిత్ర పత్రికల్లో ఉప సంపాదకులుగా పనిచేశారు. సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తూ సాహిత్యంలో కొత్తతరాన్ని తయారుచేసే కృషిలో నిమగ్నమయ్యారు. 2007 నుంచి నవ మల్లెతీగ మాసపత్రికను నడుపుతున్నారు.

9న ఉమ్మడిశెట్టి అవార్డు ప్రదాన సభ

35వ ఉమ్మడిశెట్టి సత్యాదేవి సాహితీ అవార్డు– 2022 ప్రదాన సభ ఏప్రిల్ 9, ఆదివారం రోజు అనంతపురంలో జరుగుతుంది. ప్రముఖ కవి వసీరా అవార్డును స్వీకరిస్తారు. రాధేయ పుస్తకం సాంత్వనం ఆవిష్కరణ ఉంటుంది. ముఖ్య అతిథిగా ప్రముఖ కవి కొప్పర్తి వెంకట రమణ మూర్తి పాల్గొంటారు. ఈ సభలోనే కవయిత్రులు భారతి కోడె, వాణి కొరటమద్ది, గీతా వెల్లంకి, జంగం స్వయం ప్రభ; యువ దర్శకుడు రవీంద్ర సూరి నామాలకు ఆత్మీయ సత్కారాలు నిర్వహిస్తారు.

– డా.ఉమ్మడిశెట్టి రాధేయ, అవార్డు వ్యవస్థాపకులు.

4న పుస్తక పరిచయ సభ

వర్ధమాన కవి యాడవరం చంద్రకాంత్ గౌడ్ రాసిన 'చంద్రుడు చెప్పిన కథలు' బాలల కథల సంపుటి పుస్తక పరిచయ సభ 4. 4.2023 మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటలకు సిద్ధిపేటలోని ప్రతిభ డిగ్రీ కళాశాలలో జరుగుతుంది. ఆచార్య గుమ్మన్నగారి బాల శ్రీనివాసమూర్తి, ఆచార్య మర్పడగ చెన్న కృష్ణారెడ్డి, సత్తు యాదవరెడ్డి, డాక్టర్ వాసవరవేణి పరుశురాములు, దాతారు సూర్య ప్రకాష్, బైతి దుర్గయ్య, వేల్పుల రాజు తదితరులు పాల్గొంటారు.



ఆకుపచ్చని స్వప్నం కోసం ...

ప్రతిసారి కలల ఒడ్డున
నిలబడి, చేతులు చాచి
ఊరిస్తూ ఆహ్వానిస్తావు
తీరా ఆనందాల ఒడి చేరి
సేదదీరుదామనే సమయానికి
మెరుపులా అదృశ్యమవుతావు

నీ గురించిన ఆలోచనలలో
రాబోయే రోజులన్నీ
రంగుల తోరణాలు కట్టుకుని
గుండెల్లో తీపి తీపి ఆశలు
రేపుతుంటాయి
ఇక్కడ
ఆమెల ఆర్తనాదాలు
ముళ్ళదేహాల కౌగిలింతలు
వసివాడని కసురుమొగ్గలపై
పడగనీడల చప్పుళ్ళు
లోపల గుబులు రేపుతుంటాయి
ఆరని జ్వాలలై దహిస్తుంటాయి

స్వేదజలాలను చిలకరించి
మెతుకు మొలకలతో పలకరించే అతడు
శ్రమదేహాన్ని పునాదిగా
ఆకాశహర్మ్యాలు నిర్మించే ఇతడు
దిగులు బరువును మోసుకుంటూ ఎదురొస్తారు

సింహాసనాలు రాచరికాలు
విర్రవీగుతూ
భోగలాలసతో మీసాలు మెలేస్తుంటాయి
వేప పూత కన్నా
జీవితం మరింత చేదుగా అనిపిస్తుంటే
పచ్చడి తీయదనం కమ్మదనం
పెదవులపైనే ఇగిరిపోయింది
భవిష్యత్ ఆకుపచ్చని స్వప్నం
చేతులకు అందకుండా ఎగిరిపోయింది!

– పద్మావతి రాంభక్త,
99663 07777




పునరాగమనం

సింధువంత దుఃఖాన్ని మోయలేక
కన్నీటి బిందువు ఓడి పోయింది!
హృదయ ఘోషని
విప్ప లేక భాష ఓడిపోయింది!
తత్వం తెలియక కవిత్వం ఓడిపోయింది!
తిమిరాన్ని తరమలేక
మిణుగురు ఓడిపోయింది!
రాత్రి స్వప్నాలను సాకారం చెయ్యలేక
ధరిత్రి ఓడిపోయింది !
మానవత్వపు గాయాలు మాన్చలేక
న్యాయం ఓడిపోయింది !
నేతల రాతలు నమ్మి
ప్రజాస్వామ్యం ఓడిపోయింది !

కానీ, చెట్టు ఓడిపోలేదు
రాతిలో కూడా తేమని తీసుకుని
ప్రతి వత్సరం వసంతాన్ని ఇస్తోంది !

– వీరేశ్వర రావు మూల
9494746228



జ్ఞాపకాల శిల

చెప్పకుండానే ఆకస్మాత్తుగా
మహారాజులా దర్జాగా నువెళ్లిపోయావు
కానీ వీరి దృష్టిలో నేను అంటరాని దాన్నైపోయా..
ఊపిరి నిదాగిపోయింది
బతికుండగానే ఆచారాల పేరుతో
నా ఊపిరిక్కడ నలిగిపోతుంది కర్కశంగా..

నువ్వు పోయావని
చితిమంటల్లో నీ అస్తిత్వం భస్మమైపోయింది
నేను బతికుండగానే నా
అస్తిత్వమిక్కడ విస్మితమౌతుంది..

అడుగడుగునా
ఈ లోకం నాకు సాయం చేసే మిషతో
నా హృదయానికి గాయం చేసి
నన్ను నా నుంచి మాయంజేసి
శోకవనంలోకి తోసేస్తోంది!
నేనేం చేయాలో, ఏం చేయరాదో
ఎలా ఉండాలో, ఎలా ఉండరాదో
వీళ్ళే నిర్ణయిస్తున్నారు..

నువ్వు భవబంధాలు తెంపుకుని
స్వేచ్ఛగా ఎగిరెళ్లిపోయావు
నా స్వేచ్ఛ ఇక్కడ అడుగడుగునా
సాంప్రదాయాల పంజరంలో
బందీయై మిగిలిపోయింది..

నువ్వు ఇహలోక స్వాతంత్ర్యం పొంది
అన్నింటినీ తోసిరాజని నిష్క్రమిస్తే,
నేను నా స్వాతంత్ర్యాన్ని కోల్పోయి
ఒంటరి పోరాటమై, సంఘర్షణ సంకటమై
జ్ఞాపకాల శిలయై, భావోద్వేగాల శిలాజమై
అశ్రువుల్ని ఆలింగనం చేసుకుని
ఇక్కడ బతుకీడుస్తున్నాను..!

– సర్ఫరాజ్ అన్వర్
9440981198

'క్యాస్టూమ్స్' కృష్ణ మృతి



చెన్నై : విలక్షణ నటుడిగా గుర్తింపు పొందిన 'కాస్ట్యూమ్స్' కృష్ణ చెన్నైలో ఆదివారం మరణించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చెన్నైలోని తన నివాసంలో తుది శ్వాస విడిచారు. ఆయన మృతికి పలువురు చిత్రప్రముఖులు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. కోడి రామకృష్ణ రూపొందించిన 'భారత్ బంద్' చిత్రం ద్వారా నటుడిగా పరిచయమైన ఆయన పలు చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు పొందారు. విజయనగరం జిల్లా లక్కవరపు కోటలో 1940లో ఆయన జన్మించారు. అనేక చిత్రాలకు కాస్ట్యూమ్స్ డిజైనర్‌గా పనిచేశారు.

దేశంలో కొత్తగా 3,823 పాజిటివ్ కేసులు



ఢిల్లీ : దేశంలో కరోనా కేసులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. గత 24 గంటల్లో దేశంలో 3,823 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం దేశంలో 18,389 యాక్టివ్ కేసులు ఉన్నట్టు కేంద్ర ఆరోగ్యశాఖ ఆదివారం ప్రకటించింది. శనివారంతో పోల్చితే పాజిటివ్ కేసుల సంఖ్య 27 శాతం పెరిగినట్టు స్పష్టం చేసింది. శనివారం దేశవ్యాప్తంగా 2,995 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. వైరస్ బారినపడి ఇప్పటి వరకు 5,30,881 మరణించారు.

సరళమైన భాషలో బిల్లులను రూపొందించండి

- సామాన్యులు అర్థం చేసుకునేలా ఉండాలి
- పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బిల్లుల ముసాయిదాలను సామాన్యుడు అర్థం చేసుకోవడానికి, ప్రతిపాదిత చట్టాన్ని తీసుకురావడానికి గల కారణాలను అర్థం చేసుకోవడానికి సహాయపడే భాషలో బిల్లులను రూపొందించాలని పార్లమెంటరీ ప్యానెల్ సిఫార్సు చేసింది. పార్లమెంట్‌కు న్యాయ, సిబ్బందికి సంబంధిత పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తన నివేదికను సమర్పించింది. ప్రస్తుతం కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖలోని ముసాయిదా బిల్లులన్నీ దేశంలోని మేధావులు, చట్టపరమైన చతురత, పరిజ్ఞానం ఉన్నవారే అర్థం చేసుకోగలరని పేర్కొంది. " సామాన్యుడికి కూడా అర్థమయ్యేలా సరళమైన భాషలో బిల్లులను రూపొందించాలి. డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లు-2022, ఇండియన్ టెలికమ్యూనికేషన్ బిల్లు-2022 వంటి బిల్లులను ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చింది. వాటిని అర్థం చేసుకోవడం సామాన్యులకు చాలా కష్టం" అని కమిటీ పేర్కొంది.

ప్రధాన ఎన్నికల కమీషనర్, ఎన్నికల కమిషనర్ల నియామకంతో సహా ఎన్నికల కమిషన్‌కు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు ఈ విభాగం నోడల్ ఏజెన్సీగా కూడా ఉందని, ఇది ప్రజాప్రాతినిధ్య చట్టం-1950, 1951, సంబంధిత ఎన్నికల నియమాలతో కూడా వ్యవహరిస్తుందని తెలిపింది. 2022 జనవరి 1 నుంచి 2022 డిసెంబర్ 31 వరకు 28 శాసన బిల్లులను ప్రవేశపెట్టడానికి పార్లమెంటుకు పంపినట్లు శాసన విభాగం కమిటీకి తెలిపింది. పార్లమెంటు ముందు పెండింగ్‌లో ఉన్న బిల్లులు, ఈ కాలంలో ప్రవేశపెట్టిన వాటిలో 23 చట్టాలుగా రూపొందించబడ్డాయని పేర్కొంది. ఈ కాలంలో ఆర్టికల్ 240 కింద ఆరు నిబంధనలను రాష్ట్రపతి ప్రకటించారు. 2,332 సబార్డినేట్ నియమాలు, నిబంధనలు, ఆదేశాలు, నోటిఫికేషన్లు డిపార్ట్‌మెంట్‌తో పరిశీలించబడ్డాయని తెలిపింది.

షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రైవేటీకరణ సరికాదు

- లాభదాయక పిఎస్‌యుల్లో పెట్టుబడుల ఉపసంహరణపై పునరాలోచించాలి
- పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలోని ఏకైక ప్రభుత్వ యాజమాన్య షిప్పింగ్ కంపెనీ అయిన షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌సిఐ)లో పెట్టుబడుల ఉపసంహరణ (ప్రైవేటీకరణ) సహేతుకం కాదని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ పేర్కొంది. లాభదాయకమైన, ప్రభుత్వ రంగ సంస్థ (పిఎస్‌యు)ల్లో పెట్టుబడుల ఉపసంహరణ చర్యను తప్పుపట్టింది. ఇటీవలి పార్లమెంట్‌లో రవాణా, పర్యాటకం, సంస్కృతి పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ వైసిపి ఎంపి వి.విజయసాయి రెడ్డి సమర్పించిన నివేదిక లాభదాయకమైన, ప్రధాన ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణను వ్యతిరేకించింది. "నష్టాల్లో ఉన్న పిఎస్‌యుల (ప్రభుత్వ రంగ సంస్థలు) పెట్టుబడుల ఉపసంహరణను సమర్థించవచ్చు. ప్రధాన రంగాలలో మంచి పనితీరు కనబరుస్తున్న పిఎస్‌యులు స్వల్పకాలిక ఆర్థిక లాభాల కోసం బలి చేయకూడదు" అని పేర్కొంది. లాభదాయకమైన పిఎస్‌యుల, ముఖ్యంగా ప్రధాన రంగాలలో పెట్టుబడుల ఉపసంహరణ విధానాన్ని ప్రభుత్వం పునరాలోచించాలని సిఫార్సు చేస్తూ షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వంటి వ్యూహాత్మక ఆస్తి దాని ఆర్థిక విధానానికి మాత్రమే కాకుండా సముద్ర భద్రతకు కూడా కీలకమని పార్లమెంటరీ కమిటీ పేర్కొంది. 2020 నవంబర్‌లో ఎస్‌సిఐలో పెట్టుబడుల ఉపసంహరణకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. నెల తరువాత డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ అసెట్ మేనేజ్‌మెంట్ (దీపమ్) ఎస్‌సిఐలో తన మొత్తం 63.75 శాతం వాటాను ఉపసంహరించుకోవాలని నిర్ణయించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొమ్మిది నెలల్లో ఎస్‌సిఐ రూ.468 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. ఇది 5.311 మిలియన్ డిడబ్ల్యుటి (డెడ్‌వెయిట్ టన్నేజ్), 2.94 మిలియన్ జిటి (స్థూల టన్నేజ్), దాదాపు 26 శాతం భారతీయ టన్నులతో 59 నౌకలను కలిగి ఉంది.

హుగ్లీలో మళ్లీ ఘర్షణలు

నిప్పు రాజేస్తున్న పరివార్ మూకలు



హుగ్లీ : పశ్చిమ బెంగాల్‌లో మత ఘర్షణలను రాజేసేందుకు సంఘపరివార్ శ్రీరామనవమి ర్యాలీలను అవకాశంగా వినియోగించుకుంటోంది. రామనవమి నాడు రాష్ట్రవ్యాప్తంగా వెయ్యికిపైగా ర్యాలీలను బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ నిర్వహించాయి. పలుచోట్ల రంజాన్ వేడుకలు నిర్వహించుకుంటున్న మసీదుల వద్ద ఉద్రిక్తతలు రెచ్చగొట్టేందుకు ప్రయత్నించాయి. పొరుగున ఉన్న హౌరా జిల్లాలో అల్లర్లు, గృహ దహనాలు, వాహన దహనాలు చోటుచేసుకున్నాయి. నవమి ముగిసి రెండు రోజులైన తరువాత ఆదివారం సాయంత్రం హుగ్లీ జిల్లా రిష్రా పోలీస్ స్టేషన్ పరిధి జిటి రోడ్డులో బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించాయి. ఆ సమయంలో రాళ్లు పడటంతో ఉద్రిక్తత నెలకొందని, పరిస్థితిని అదుపు చేశామని పోలీసులు తెలిపారు. బిజెపి ఎమ్మెల్యే బిమన్‌ఘోష్ గాయపడినట్లు ఆ పార్టీ నాయకులు చెప్పారు. ర్యాలీలో ఉన్న వారు, స్థానికులు, పోలీసులు కూడా గాయపడ్డారని చెప్పారు. రంజాన్ మాసంలో ఉద్రిక్తతలు రెచ్చగొట్టేందుకు నవమి ముగిసిన రెండు రోజుల తర్వాత ర్యాలీ నిర్వహించారని టిఎంసి అధికార ప్రతినిధి మజుందార్ విమర్శించారు.

మతోన్మాద కుట్రలను తిప్పికొట్టండి : సలీం

శాంతి, సామరస్యాలను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి కుట్రలను తిప్పికొట్టాలని సిపిఎం పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ సలీం పిలుపునిచ్చారు. హౌరాలో ఆదివారం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు.

పబ్లిక్ సర్వెంట్ల ఆస్తుల తనిఖీకి యంత్రాంగం

- పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సిఫార్సు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పబ్లిక్ సర్వెంట్లు (ఐఎఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు) దాఖలు చేసిన ఆస్తుల వివరాల వాస్తవికతను తనిఖీ చేయడానికి యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని పర్సనల్, పబ్లిక్ గ్రీవెన్స్, లా అండ్ జస్టిస్ సంబంధిత స్టాండింగ్ కమిటీ సిఫార్సు చేసింది. పార్లమెంట్‌కు స్టాండింగ్ కమిటీ తన నివేదికను సమర్పించింది. పెద్ద సంఖ్యలో ఐఎఎస్ అధికారులు వార్షిక స్థిరాస్తి రిటర్న్‌లను దాఖలు చేయలేదని పేర్కొంటూ, పార్లమెంటరీ కమిటీ దానిని పరిశీలించేందుకు ఒక ప్యానెల్‌ను ఏర్పాటు చేయాలని కేంద్ర సిబ్బంది, శిక్షణ మంత్రిత్వ శాఖను కోరింది. 2011 నుండి 2022 కాలంలో 1,393 మంది ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఎఎస్) అధికారులు తమ ఆస్తుల వివరాలను దాఖలు చేయలేదని కమిటీ పేర్కొంది. అవినీతిని నిరోధించే లక్ష్యంతో సమర్థవంతమైన పద్ధతులను రూపొందించి, ప్రోత్సహించాలని ఆదేశించే అవినీతికి వ్యతిరేకంగా ఐక్యరాజ్యసమితి కన్వెన్షన్ (యుఎన్‌సిఎసి)పై భారతదేశం సంతకం చేసిందని గుర్తు చేసింది. యుఎన్‌సిఎసికి సంబంధించిన అంశాలతో సహా అవినీతి నిరోధక శాఖకు పర్సనల్, ట్రైనింగ్ డిపార్టుమెంట్ నోడల్ విభాగమని కమిటీ పేర్కొంది. ఇండియన్ ఫారిన్ సర్వీస్(ఐఎఫ్ఎస్), ఇతర ఆలిండియా సర్వీస్‌లో ఉన్న భార్యాభర్తలను ఒకే దగ్గర పోస్టింగ్ ఇచ్చే అంశాన్ని పరిగణనలోకి తీసుకొని, తగిన మార్గదర్శకాలు రూపొందించాలని కమిటీ సూచించింది.

3 నెలల్లో రూ.3.78 లక్షల కోట్లు

కేంద్రం అప్పులు



డిసెంబర్ నాటికి రూ.150.95 లక్షల కోట్లకు పెరిగిన రుణాలు

- పబ్లిక్ డెట్ మేనేజ్‌మెంట్ నివేదిక

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

అప్పులపై రాష్ట్రాలకు నిత్యం సుద్దులు చెప్పే కేంద్ర ప్రభుత్వం తాను మాత్రం ఇబ్బడిముబ్బడిగా రుణాలు చేస్తోంది. మూడు నెలల్లోనే రూ.3.78 లక్షల కోట్లు అప్పులు చేసింది. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని పబ్లిక్ డెట్ మేనేజ్‌మెంట్ (పిడిఎం) కేంద్ర ప్రభుత్వం అప్పులపై తాజాగా నివేదిక ఇచ్చింది. 2022 డిసెంబర్ చివరి నాటికి కేంద్రం రుణాలు రూ.1,50,95,970.8 కోట్లకు పెరిగినట్లు పిడిఎం పేర్కొంది. సెప్టెంబర్ 30 నాటికి రూ.1,47,17,572.2 కోట్ల అప్పు ఉందని తెలిపింది. అక్టోబర్, నవంబర్, డిసెంబర్ మూడు నెలల్లోనే రూ.3,78,398.6 కోట్లు పెరిగిందని తెలిపింది. అంటే 2.6 శాతం అప్పు పెరిగిందని పేర్కొంది. డిసెంబర్ త్రైమాసికంలో మొత్తం బకాయి రుణాలలో ప్రభుత్వ అప్పు వాటా 89 శాతంగా ఉంది. దాదాపు 28.29 శాతం గడువు తేదీ ఉన్న సెక్యూరిటీలు ఐదేళ్ల కంటే తక్కువ కాల వ్యవధిని కలిగి ఉన్నాయి. 2022-23 మూడో త్రైమాసికంలో కేంద్ర ప్రభుత్వం డేటెడ్ సెక్యూరిటీల ద్వారా రూ.3,51,000 కోట్ల విలువైన మొత్తాన్ని సేకరించింది. అయితే రుణ క్యాలెండర్‌లో నోటిఫై చేసిన మొత్తం రూ.3,18,000 కోట్లుగా ఉందని నివేదిక పేర్కొంది. నోటిఫై చేసిన దాని కంటే ఎక్కువ అప్పు చేసినట్లు నివేదిక స్పష్టం చేసింది. ప్రైమరీ ఇష్యూల వెయిటెడ్ యావరేజ్ ఈల్డ్ 2022-23 రెండో త్రైమాసికంలో 7.33 శాతం నుంచి మూడో త్రైమాసికంలో 7.38 శాతానికి పెరిగిందని తెలిపింది. 2022 డిసెంబరు 7న ద్రవ్య విధాన కమిటీ (ఎంపిసి) ద్రవ్యోల్బణాన్ని నియంత్రించే ఉద్దేశంతో పాలసీ రెపో రేటును 35 బేసిస్ పాయింట్లు, 5.90 శాతం నుండి 6.25 శాతానికి పెంచాలని నిర్ణయించిందని పేర్కొంది. 2023 ఫిబ్రవరి 8న రిజర్వ్ బ్యాంక్ కీలకమైన ప్రధాన ద్రవ్యోల్బణాన్ని పేర్కొంటూ కీలక బెంచ్ మార్క్ పాలసీ రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచి 6.5 శాతానికి చేర్చింది.

నిరుద్యోగం పైపైకి....



36.7 శాతానికి పడిపోయిన ఉపాధి రేటు

హర్యానాలో అత్యధికం... ఛత్తీస్‌గఢ్ అత్యల్పం

సిఎంఐఇ నివేదిక వెల్లడి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలోకి భారీగా పెట్టుబడులు వస్తున్నాయని, ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఓ పక్క విస్తృతంగా ప్రచారం చేసుకుంటుండగా, వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. దేశంలో నిరుద్యోగ రేటు మార్చిలో మూడు నెలల గరిష్ట స్థాయికి చేరింది. 7.80 శాతానికి పెరిగిపోయింది. ఈమేరకు ఆదివారం సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సిఎంఐఇ) విడుదల చేసిన గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. పట్టణ నిరుద్యోగ రేటు 8.51శాతం కాగా, గ్రామీణ నిరుద్యోగ రేటు 7.47 శాతం నమోదైంది. జనవరిలో 7.14 శాతం నిరుద్యోగ రేటు ఉండగా, అది ఫిబ్రవరి నాటికి 7.45 శాతానికి పెరిగింది. మార్చిలో 7.80 శాతానికి పెరిగింది. దేశంలో అత్యధికంగా నిరుద్యోగ రేటు నమోదైన రాష్ట్రాల్లో 26.8 శాతంతో హర్యానా, 26.4 శాతంతో రాజస్థాన్, 23.1 శాతంతో జమ్ముకాశ్మీర్ మొదటి మూడోస్థానాల్లో నిలిచాయి. 20.7 శాతంతో సిక్కిం, 17.6 శాతంతో బీహార్, 17.5 శాతంతో జార్ఖండ్, 15.9 శాతంతో గోవా, 11.7 శాతంతో హిమాచల్ ప్రదేశ్, 9.7 శాతంతో ఢిల్లీ తరువాత స్థానాల్లో నిలిచాయి. మిగిలిన రాష్ట్రాలన్నీ జాతీయ సగటు కంటే తక్కువ నిరుద్యోగ రేటును నమోదు చేసుకున్నాయి. 0.8 శాతంతో ఛత్తీస్‌గఢ్ అత్యల్ప నిరుద్యోగ రేటు నమోదు చేసుకుంది. ఉపాధి రేటు ఫిబ్రవరిలో 36.9 శాతం నుంచి మార్చిలో 36.7 శాతానికి పడిపోయింది. సంఖ్యా పరంగా ఉపాధి రేటు 409.9 మిలియన్ల నుంచి 407.6 మిలియన్లకు పడిపోయింది. "మార్చిలో దేశ కార్మిక మార్కెట్లు క్షీణించాయి. నిరుద్యోగిత రేటు ఫిబ్రవరిలో 7.5 శాతం నుంచి మార్చిలో 7.8 శాతానికి పెరిగింది. శ్రామిక శక్తి భాగస్వామ్య రేటు ఏకకాలంలో పడిపోవడంతో దీని ప్రభావం 39.9 శాతం నుంచి 39.8 శాతానికి పడిపోయింది" అని సిఎంఐఇ మేనేజింగ్ డైరెక్టర్ మహేష్ వ్యాస్ తెలిపారు.

రాష్ట్రంలో స్వల్ప పెరుగుదల

ఆంధ్రప్రదేశ్‌లో 7.5 శాతంతో జాతీయ సగటు కంటే తక్కువ నిరుద్యోగ రేటు నమోదైంది. జనవరి నెలలో 5.5 శాతం నిరుద్యోగ రేటు నమోదు కాగా, ఫిబ్రవరి నాటికి 6.6 శాతానికి పెరిగింది. మార్చిలో 7.5 శాతానికి పెరిగింది. తెలంగాణలో 5.2 శాతంతో జాతీయ సగటు కంటే తక్కువ నిరుద్యోగ రేటు నమోదైంది. ఫిబ్రవరి (5.8 శాతం) కంటే స్వల్పంగా తగ్గింది.

రష్యాను ఒంటరిపాటు చేసే యత్నాలు విఫలం

- మాస్కోకే ఐరాస భద్రతామండలి ప్రెసిడెన్సీ

మాస్కో : ప్రపంచ వేదికపై రష్యాను ఒంటరిపాటు చేయాలని అమెరికా, ఇతర పశ్చిమ దేశాలు పన్నిన కుతంత్రాలు బెడిసికొట్టాయి. ఐరాస భద్రతా మండలి ప్రెసిడెన్సీ (అధ్యక్ష బాధ్యతలు) రొటేషన్ పద్ధతిలో రష్యాకే దక్కాయి. పోలండ్ డిప్యూటీ విదేశాంగ మంత్రి పావెల్ జబ్‌లోన్‌స్కీ రిపబ్లికా టీవీ ప్రతినిధితో మాట్లాడుతూ, ఉక్రెయిన్ యుద్ధాన్ని ముందుకు తెచ్చి, భద్రతా మండలి అధ్యక్ష బాధ్యతలు రష్యాకు దక్కకుండా చేయాలని తాము చేసిన యత్నాలు ఫలించలేదని అన్నారు. అధ్యక్ష బాధ్యతలు రష్యాకు అప్పగించరాదని పోలండ్ వాదించింది. రష్యాను భద్రతామండలి నుంచి, ఐరాస నుంచి మొత్తంగా తొలగించి వేద్దామని అనుకున్నాం అది కూడా సాధ్యం కావడం లేదు. భద్రతా మండలిలోని అయిదు శాశ్వత సభ్య దేశాల్లో రష్యా కూడా ఒకటి. కాబట్టి ఇందుకు సంబంధించి ఏ తీర్మానం తేవాలన్నా రష్యా తన వీటో హక్కును ఉపయోగించి అడ్డుకుంటుంది. కాబట్టి, ఆ దేశంపై మరిన్ని ఆంక్షలు విధిద్దామా అని అనుకుంటే దాని నుంచి రష్యా అవలీలగా బయటపడుతోంది. ఇతర దేశాలను మిత్రులుగా అది సంపాదించుకుంటుండడంతో ఆంక్షలు పెద్దగా ఏమీ పనిచేయడం లేదని, దీంతో ఇయు పలుకుబడి కూడా పలచబడిపోతోందని పోలండ్ ఉప ప్రధాని పేర్కొన్నారు. భద్రతా మండలి అధ్యక్ష బాధ్యతలను ఆల్ఫాబెటికల్ ఆర్డర్‌లో మండలిలోని 15 దేశాలు ఒకరి తరువాత ఒకరు చేపట్టడం 1946 నుంచి ఆనవాయితీగా వస్తోంది. ఆ రొటేషన్ పద్ధతి ప్రకారం ఇప్పుడు రష్యా వంతు వచ్చింది.

క్రెడిట్ సూయిస్ టేకోవర్ తరువాత

- యుబిఎస్‌లో మూడో వంతు ఉద్యోగాల కోత!

బెర్న్: క్రెడిట్ సూయిస్‌ను టేకోవర్ చేసిన తరువాత యుబిఎస్ మూడో వంతు ఉద్యోగాలపై కోత పెట్టేందుకు సిద్ధమవుతోంది. దాదాపు 72వేల మంది సిబ్బంది కలిగిన యుబిఎస్, 50 వేల మంది ఉద్యోగులు ఉన్న క్రెడిట్ సూయిస్ రెండూ విలీనమయ్యాక 20-30 శాతం మంది ఉద్యోగులను తీసేయాలని స్విట్జర్లాండ్‌కు చెందిన యుబిఎస్ నిర్ణయించుకున్నట్లు పేరు తెలపడానికి ఇష్టపడని ఆ బ్యాంక్ మేనేజరు ఒకరు తెలిపారు. యుబిఎస్, జ్యూరిచ్‌కు చెందిన తన ప్రత్యర్థి క్రెడిట్ సూయిస్‌ను 330 కోట్ల స్విస్ ఫ్రాంక్‌లకు యుబిఎస్ కొనేసింది. ఈ మేరకు యుబిఎస్, క్రెడిట్ సూయిస్ మధ్య ఒక ఒప్పందం కుదిరింది. ఈ రెండు బ్యాంకుల విలీన ఒప్పందానికి స్విస్ ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో పడకుండా చూసేందుకు ప్రభుత్వం, స్విట్ సెంట్రల్ బ్యాంకు, మార్కెట్ రెగ్యులేటర్ కలసికట్టుగా యత్నించాయి. ఒక లక్షా 60వేల కోట్ల డాలర్ల ఆస్తులు, ప్రపంచ వ్యాపితంగా లక్షా 20 వేల మందికిపైగా సిబ్బందిని కలిగి ఉన్న ఈ బ్యాంకు ఒక్క స్విట్జర్లాండ్‌లోనే 11 వేల ఉద్యోగాలపై వేటు వేయాలని చూస్తోంది.

డాలర్ వద్దు లోకల్ కరెన్సీయే ముద్దు

- సంక్షోభ నివారణకు ఏషియాన్ యత్నాలు



బాలిలో సమావేశానికి హాజరైన ఏషియాన్ దేశాల ఆర్థిక మంత్రులు, సెంట్రల్ బ్యాంకు గవర్నర్లు

జకార్తా: సంక్షోభ నివారణకు ఆగ్నేయాసియా (ఏషియాన్)దేశాలు ఈ ప్రాంతంలో స్థానిక కరెన్సీ వాడకం వైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్నాయి. డాలర్ వంటి ప్రధాన అంతర్జాతీయ కరెన్సీలపై ఆధారపడడం వల్ల గ్లోబల్ సంక్షోభంలో తాము కూడా కూరుకుపోయే ప్రమాదముందని ఈ దేశాలు గ్రహించాయి. అందుకే డాలర్ల వాడకాన్ని వీలున్నంతమేరకు వాడకుండా ఉండాలని నిర్ణయించుకున్నాయి. గత వారం బాలిలో జరిగిన ఏషియాన్ దేశాల ఆర్థిక మంత్రులు, సెంట్రల్ బ్యాంకు గవర్నర్ల సమావేశంలో ఈ మేరకు తీర్మానించుకున్నట్లు ఇండొనేషియా సెంట్రల్ బ్యాంక్ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సమావేశానికి ఇండొనేషియా ఈసారి అధ్యక్షత వహించింది. డాలర్ నుండి లోకల్ కరెన్సీకి పరివర్తనా ప్రక్రియను రూపొందించేందుకు ఏషియాన్ ఒక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తుందని ఆ సంస్థ చైర్మన్ పెర్రీ వార్జియో తెలిపారు. ఈ ప్రాంత దేశాల మధ్య ఆర్థిక లావాదేవీలన్నీ స్థానిక కరెన్సీలోనే జరపాలని, ఏవైనా వివాదాలు తలెత్తితే వాటిని కో-ఆపరేషన్ ఫ్రేమ్‌వర్క్ పరిధిలో పరిష్కరించుకోవచ్చని ఆయన తెలిపారు. స్థానిక కరెన్సీలో లావాదేవీలు పెరగడం వల్ల అది ఈ ప్రాంత దేశాల సరిహద్దుల మీదుగా జరిపే వాణిజ్యాన్ని మరింత విస్తరించుకోవచ్చని అన్నారు.



ఆర్‌ఎల్‌వి ఎల్‌ఇఎక్స్ విజయవంతం : ఇస్రో

బెంగళూరు : పునర్వినియోగ లాంచ్ వెహికల్ ల్యాండింగ్ ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ప్రకటించింది. కర్ణాటక చిత్రదుర్గలోని ఏరోనాటికల్ టెస్ట్ రేంజ్ (ఎటిఆర్)లో ఆదివారం పునర్వినియోగ లాంచ్ వెహికల్ అటానమస్ ల్యాండింగ్ మిషన్ (ఆర్‌ఎల్‌వి ఎల్‌ఇఎక్స్)ని చేపట్టింది. డిఆర్‌డిఒ, ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌తో కలిసి సంయుక్తంగా ఈ పరీక్ష చేపట్టినట్లు ఇస్రో తెలిపింది. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ (ఐఎఎఫ్), సెంటర్ ఫర్ మిలిటరీ ఎయిర్‌వర్తినెస్ అండ్ సర్టిఫికేషన్ (సిఇఎంఐఎల్‌ఎసి), ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ (ఎడిఇ) ఏరియల్ డెలివరీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ (ఎడిఆర్‌డిఇ) వంటి సంస్థలు ఈ పరీక్షకు సహకరించినట్లు పేర్కొంది.

ప్రపంచంలోనే తొలిసారి రెక్కలున్న లాంచ్ వెహికల్‌ను హెలికాప్టర్ ద్వారా 4.5 కిలోమీటర్ల ఎత్తుకు తీసుకెళ్లినట్లు పేర్కొంది. అనంతరం ఆకాశం నుంచి సురక్షితంగా రన్‌వేపై ల్యాండింగ్ చేసినట్లు వెల్లడించింది. ఆదివారం ఉదయం 7:10 గంటలకు భారత వైమానిక దళానికి చెందిన చినూక్ హెలికాప్టర్ ద్వారా తిరిగి వినియోగించే లాంచ్ వెహికల్ (ఆర్‌ఎల్‌వి) 4.5 కిలోమీటర్ల ఎత్తుకు ఎగిరినట్లు ఇస్రో తెలిపింది. అనంతరం ఇంటిగ్రేటెడ్ నావిగేషన్, గైడెన్స్, కంట్రోల్ సిస్టమ్‌ను ఉపయోగించి దానికదే రన్‌వేపై ల్యాండ్ అయినట్లు చెప్పింది. చిత్రదుర్గలోని ఏరోనాటికల్ టెస్ట్ రేంజ్ (ఎటిఆర్)లో ఆదివారం ఉదయం 7:40 గంటలకు ఆటోమేటిక్ ల్యాండింగ్‌ను అది పూర్తి చేసినట్లు వెల్లడించింది. మానవరహిత రీయూజబుల్ లాంచ్ వెహికల్ (ఆర్‌ఎల్‌వి) అంతరిక్షం నుంచి చాలా వేగంగా, కచ్చితత్వంతో వచ్చి భూమిపై ల్యాండ్ అయ్యిందని ఇస్రో ప్రకటించింది. ఈ ప్రయోగానికి సంబంధించిన వీడియోను ట్విట్టర్‌లో పోస్ట్ చేసింది.

లోయలో పడిన బస్సు

- ఇద్దరు మృతి : 38 మందికిగా గాయాలు



డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్‌లో బస్సు లోయలో పడి, ఇద్దరు మరణించగా, 38 మంది గాయాల పాలయ్యారు. ఆదివారం ఉదయం ముస్సోరీ-డెహ్రాడూన్ మార్గంలో ప్రయాణిస్తున్న ఆర్‌టిసి బస్సు షెర్గాడి ప్రాంతంలో అదుపుతప్పి లోయలోకి దూసుకెళ్లింది. ప్రమాద సమయంలో బస్సులో 40 మంది ప్రయాణికులున్నారని ముస్సోరి పోలీసులు తెలిపారు. ప్రమాదంలో ముస్సోరికి చెందిన తల్లికూతురు మరణించారు. ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటిబిపి) సహాయంతో గాయపడిన వారిని లాండూర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వారిలో తీవ్ర గాయాలైన 26 మందిని డెహ్రాడూన్‌లోని డూన్, మ్యాక్స్ ఆసుపత్రులకు తరలించారు. డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడం, మలుపు వద్ద బస్సును అదుపు చేయలేకపోవడం వల్ల ప్రమాదం జరిగినట్లు పోలీసులు చెబుతున్నారు.

పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించాలి

- పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పదేళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్న 1,350 కేసులను ప్రాధాన్యతా ప్రాతిపదికన పరిష్కరించాలని సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (క్యాట్)ని సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, లా అండ్ జస్టిస్ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ కోరింది. ఈ మేరకు పార్లమెంట్‌కు సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, లా అండ్ జస్టిస్ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తన నివేదికను సమర్పించింది. పెన్షనర్లు, సీనియర్ సిటిజన్‌లకు సంబంధించిన కేసులను సత్వరమే పరిష్కరించాలని సూచించింది. 2022 డిసెంబర్ 31 నాటికి ట్రిబ్యునల్‌లోని వివిధ బెంచ్‌లలో 80,545 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని కమిటీ తెలిపింది. వీటిలో 16,661 కేసులు సున్నా నుండి ఒక సంవత్సరం వరకు, 46,534 కేసులు ఒకటి నుండి ఐదేళ్ల వరకు, 16,000 కేసులు ఐదు నుండి 10 సంవత్సరాల వరకు, 1,350 కేసులు పదేళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్నాయని కమిటీ తన నివేదికలో పేర్కొంది. సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (ప్రొసీజర్) రూల్స్-1987 ప్రకారం ప్రతి దరఖాస్తును నమోదు చేసిన తేదీ నుండి ఆరు నెలల్లోపు వీలైనంత వరకు విచారించి, పరిష్కరించాలని కమిటీ పేర్కొంది. ట్రిబ్యునల్‌లో పెన్షన్‌కు సంబంధించి దాదాపు 3,716 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని కమిటీ గుర్తించింది. ఈ కేసులను క్యాట్ పరిష్కరించాలని కమిటీ సిఫార్సు చేసింది. సీనియర్ సిటిజన్లకు సంబంధించినవి, పదేళ్ల కంటే ఎక్కువ పెండింగ్‌లో ఉన్న కేసులను ప్రాధాన్యతా ప్రాతిపదికన, అవసరమైతే ప్రత్యేక డ్రైవ్‌లను నిర్వహించి పరిష్కరించాలని సూచించింది. క్యాట్‌లో, ట్రిబ్యునల్‌లోని కొన్ని బెంచ్‌లలో సభ్యుల ఖాళీ కారణంగా, కేసులు పెండింగ్‌లో ఉన్నాయని కమిటీ నివేదికలో పేర్కొంది. ఈ ఖాళీలను వీలైనంత త్వరగా భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలని కమిటీ సిఫార్సు చేసింది.

బీహార్‌లో హై టెన్షన్

- ఒకరు మృతి.. పలువురికి గాయాలు


పాట్నా : బీహార్‌లో హైటెన్షన్ నెలకొంది. రోహ్‌తాస్, నలంద జిల్లాల్లో భారీగా భద్రతా దళాలను మోహరించారు. నలంద జిల్లాలో ఉద్రిక్తతల్లో ఒకరు మరణించినట్లు అధికారులు తెలిపారు. రామనవమి ఉత్సవాల సందర్భంగా ఆర్‌ఎస్‌ఎస్ మూకలు ఉద్రిక్తతలను రెచ్చగొట్టడంతో రోహ్‌తాస్, నలంద, భాగల్పూర్, గయ జిల్లాల్లో హింసాత్మక వాతావరణం నెలకొన్న సంగతి తెలిసిందే. శనివారం సాయంత్రం నలంద జిల్లా బీహార్‌షరీఫ్‌లో ఇరు గ్రూపుల మధ్య చెలరేగిన ఘర్షణల్లో ఒకరు మరణించగా, పలువురు గాయపడ్డారని అధికారులు తెలిపారు. రోహ్‌తాస్ జిల్లా ససారమ్ పట్టణంలో జరిగిన పేలుళ్లలో ఆరుగురు గాయపడినట్లు వివరించారు. ససారమ్‌లోని ఒక ఇంటిలో పేలుడు జరిగిందని, ఘటనా స్థలం నుండి ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. సుమారు 80 మందిని అరెస్ట్ చేశామని నలంద జిల్లా మెజిస్ట్రేట్ శశాంక్ శుభంకర్ తెలిపారు. ముందు జాగ్రత్త చర్యగా ఇంటర్నెట్‌ను నిలిపివేసినట్లు చెప్పారు.



అమెరికాలో టోర్నడో విధ్వంసం ..

- 26 మంది మృతి

న్యూయార్క్ : అమెరికాలో తుఫాన్లు, టోర్నడోలు మరోసారి విధ్వంసం సృష్టించాయి. గతవారం మిసిసిపి పరిసర ప్రాంతాల్లో బీభత్సం సృష్టించిన టోర్నడో తాజాగా దక్షిణ, పశ్చిమమధ్య ప్రాంతాలను వణికించింది. టోర్నడోల ధాటికి 26 మంది మరణించగా, పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. అర్కన్సాస్, ఇల్లినాయిస్‌తోపాటు ఎనిమిది రాష్ట్రాల్లో తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. బెల్విడెరేలోని ఓ థియేటర్ లో పైకప్పు కూలిపోయింది. అర్కాన్సాస్, ఇల్లినాయిస్, ఇండియానా మరియు టేనస్సీలతో పాటు నేషనల్ వెదర్ సర్వీస్ విస్కాన్సిస్, ఐయోవా మిస్సిస్సిప్పిలలో సుడిగాలులు వచ్చాయి. ఆగ్నేయా అమెరికా రాష్ట్రమైన మిస్సిస్సిప్పీలో విధ్వంసకర తుఫాన్‌తో తీవ్రమైన ఉరుములతో కూడిన సుడిగాలి వచ్చింది. గంటకు 100 కిలోమీటర్లకుపైగా వేగంతో పెనుగాలులు విరుచుకుపడటంతో నివాసాలు, షాపింగ్ మాల్స్ కుప్పకూలాయి. మౌలిక సదుపాయాలకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. గాలి తీవ్రతకు చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. దీంతో సుమారు 3 లక్షలకుపైగా నివాసాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పెనుగాలుల వల్ల అక్కడక్కడ అగ్నిప్రమాదాలు కూడా చోటుచేసుకున్నాయి. రవాణా వ్యవస్థ స్థంభించిపోయింది. షికాగో ఎయిర్‌పోర్టులు విమానాల రాకపోకలను నిలిపివేశారు. వచ్చే బుధవారం మరికొన్ని భారీ తుఫాన్లు, టోర్నడోలు వచ్చేఅవకాశం ఉందని వాతావరణ విభాగం హెచ్చరించింది. అర్కాన్సాస్, మిస్సోరిలో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు.



మీకోసం

సబ్జా గింజలను వేడినీటిలో నానబెట్టి పాలలో కలిపి మధ్యాహ్నం సమయంలో తాగితే శరీరంలోని అధిక వేడి తగ్గిపోతుంది.

జీవన సౌరభం

డబ్బు లేనివాడు కాదు.. జీవితంలో ఒక లక్ష్యం లేనివాడు నిజమైన పేదవాడు.

పరీక్షలంటే బెంగపడకు



పరీక్షలంటే భయపడకు
పరీక్షలంటే బెదరకు
ఆత్మ న్యూనతా వద్దు
ఆత్మ విశ్వాసమే ముద్దు


పుష్టికరమైన ఆహారం
ఆరోగ్యమే మహాభాగ్యం
కలతలు చెందకు
కన్నీరు కార్చకు

చిరునవ్వులు చిందించు
చిరంజీవిగా వర్ధిల్లు
జీవితమే ఒక పరీక్ష
భవితకిది తొలి పరీక్ష

తల్లిదండ్రులు గురువులు
ఎప్పుడు నీకు నేస్తాలు
సంతోషంగా పరీక్ష రాయు
ఫలితాలలో జయం నీకు

యాడవరం చంద్రకాంత్ గౌడ్
94417 62105

తేడాలు గుర్తించండి



పిల్లలూ! ఈ చిత్రంలో ఐదు తేడాలు ఉన్నాయి. అవి ఏంటో గుర్తించండి

నేను గీసిన బొమ్మ



-ఏ. జీవిత, 8 వ తరగతి,
జిల్లా పరిషత్
ఉన్నత పాఠశాల,
యాదమరి, చిత్తూరు జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

పూలు, పండ్లతో రంగులు



రసాయనాలతో కలిపి వేసే రంగుల దుస్తులు వల్ల క్యాన్సర్, ఇతర వ్యాధులు వస్తాయని గ్రహించిన మాన్య సహజ సిద్ధ రంగుల తయారీకి పూనుకుంది. వాటితో పసిపిల్లల వస్త్రాలు నేస్తుంది. అందుకు లక్ష రూపాయల ఉద్యోగాన్నీ వదులకుంది. తాను నేర్చుకున్న కళను, తెలుసుకున్న విద్యను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌ల ద్వారా అందరికీ తెలియజేస్తోంది.

'ప్రకృతిలో ఎన్నో రంగులున్నాయి. వాటిని దుస్తుల మీద వేస్తే మరింత అందంగా ఉంటాయి' అంటున్న మాన్యది హైదరాబాద్. యూనివర్సిటీ ఆఫ్ వర్జీనియాలో ఆర్ట్స్ అండ్ బిజినెస్ డ్యూయల్ డిగ్రీ పూర్తి చేసింది. డిజైనర్‌గా ఓ కంపెనీలో ఆరు సంవత్సరాల పాటు ఉద్యోగం చేసింది. మంచి జీతం. కాని కొన్ని రోజులకు జీవితం యాంత్రికంగా అనిపించింది. తన అభిరుచుల్లో ఒకటైన, మనసుకు నచ్చిన వృత్తి చేపట్టాలని నాలుగేళ్ల క్రితం ఉద్యోగానికి రాజీనామా చేసింది. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో వ్యాపార వృత్తుల మీద దృష్టి పెట్టింది.

సహజ సిద్ధ రంగుల కోసం

' నా బాల్యంలో మా ఇంటి ముందు రకరకాల పూల మొక్కలు వేసింది అమ్మ. ఉదయం రంగురంగుల పూలను చూస్తూంటే మనసుకు ఎంతో ఆహ్లాదంగా అనిపించేది. ఆ తోటలో ఉదయం, సాయంత్ర వేళల్లో ఆడుకునేవాళ్లం. సెలవు రోజుల్లో అక్కడే ఎక్కువ సమయం గడేపేవాళ్లం. ప్రకృతి మనకు స్ఫూర్తి. అందుకే ప్రకృతితో ముడిపడిన పని ఎంచుకోవాలని నిర్ణయించుకున్నా. గోవాలోని న్యాచురల్ కలర్ ఆశ్రమ్‌లో వర్క్‌షాపులకు హాజరయ్యా. ఈ వర్క్‌షాపు ఉద్దేశాన్ని వేరే కోణంలో చూశా. రంగుల స్థిరత్వం కోసం కెమికల్స్ కలపడం చూసి ఆశ్చర్యపోయా. ఆ రసాయనాలు చేసే నష్టం ఏంటో బాగా తెలుసు. వాటిని ఉపయోగించి రంగులు తయారుచేస్తున్న కార్మికులు క్యాన్సర్, ఇతర దుష్ప్రభావాలతో బాధపడుతున్నారు. పర్యావరణానికీ హానికరం. ఆ సింథటిక్ బట్టలు వేసుకున్న మనకీ రోగాలు వస్తాయి. అందుకే సహజ సిద్ధ రంగుల కోసం ప్రయత్నించా. చాలా ప్రదేశాలకు వెళ్లి కనుక్కున్నా. కాని రసయనాలు వాడకుండా రంగుల తయారీ చాలా తక్కువ అని అర్థమైంది. అందుకు నేనే ఆ పనికి పూనుకున్నా. మన చుట్టూ ఉన్న పండ్లు, పూలే నా పెట్టుబడి. ప్రకాశవంతమైన గులాబీలు, బంతి, పసుపు, నారింజ, బీట్‌రూట్, క్యారెట్ల, పసుపు కొమ్ములు, ఆకుకూరలు..ఇలా రంగురంగుల కాయగూరలు, పండ్లతో రంగులు తయారుచేస్తున్నా. తెలిసిన వాళ్లని సలహాలు, సూచనలూ అడిగి, ఆ రంగులను తెల్లని దుస్తులపై ఎలా వేయాలో రకరకాల పద్ధతులు, ప్రయోగాలతో కనుగొన్నా. అందమైన కళారూపాలు వచ్చాయి. ఈ రంగులను శు భకార్యాల్లోనూ వాడుకోవచ్చు. హోలీ పండగ, ఇతర సందర్భాల్లోనూ ఉపయోగించొచ్చు.





పిల్లల వస్త్రాలపై

మొదట పసిపిల్లల బట్టలతోనే ప్రారంభించా. నెలల పిల్లలకు ఎక్కువ మంది కాటన్ వస్త్రాలు వేస్తారు. ఆ క్లాత్‌ను ఎంచుకుని సహజసిద్ధంగా తయారుచేసిన రంగులను చేతితో వేస్తున్నాం. సహజ రంగులతో బేబీ దుస్తులను తయారు చేసే బ్రాండ్‌లు దాదాపు ఏవీ లేవు. దాన్నే నా వ్యాపారంగా మలుచుకున్నా. దాంతో మనసుకు తృప్తిగా ఉంది. ఇందులో లాభం గురించి ఆలోచించకుండా నాకు తెలిసిన ఈ పద్ధతులను అందరికీ తెలియజేయాలనుకున్నా. మన చుట్టూ ప్రకృతి ప్రేమికులు చాలా మంది ఉంటారు. వారి కోసం దేశంలో ప్రధాన నగరాల్లో ఇప్పటి వరకూ 150 వర్క్‌షాపులు నిర్వహించా. 5300 మందికి కొన్ని నెలల పాటు శిక్షణ ఇచ్చా. నా శ్రమకు తగ్గ మార్పు కనిపించింది. చాలా మంది తమ వస్త్రాలపై తామే స్వయంగా రంగులు వేసుకుంటున్నారు. ఇంట్లో వాడే బెడ్‌షీట్లు, కటన్లు, దుప్పట్లు, రూమాలు రంగులు లేనివి వాడటం అంటే కష్టమే. కాని వేసుకునే దుస్తులు అయినా సహజసిద్ధమైన రంగులతో వేసినవి వాడుకుంటే ఆరోగ్యానికి మంచిదని నా ఉద్దేశం.

కరోనాలోనూ..

కరోనా లాక్‌డౌన్ సమయంలో కూడా నా ప్రయత్నం ఆపలేదు. నేచురల్ డైయింగ్ నేర్చుకోవాలనే ఆసక్తి ఉన్న వ్యక్తుల కోసం మాన్య 'ట్రీహౌస్' పేరుతో ఆన్‌లైన్‌లో వర్క్‌షాప్‌లను నిర్వహించా. రంగులను తయారుచేసే ప్రక్రియను కూడా నా బ్లాగ్‌ల్లో ఉంచా. అంతే కాదు ..డిజైన్స్ కూడా నేర్పించా. దీనికి ఖర్చు చాలా తక్కువ. ఒక అభిరుచిగా నేర్చుకున్నా– తర్వాత వృత్తిగా కూడా మార్చుకోవచ్చు. దాంతో కార్బన్ ఉద్గారాలను తగ్గించి, ప్రకృతిని కాపాడినవాళ్లం అవుతాం'. అంటారు మాన్య.

ఎండలో ప్రయాణం...జాగ్రత్త



రోజురోజుకూ ఎండలు పెరుగుతున్నాయి. ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు ముఖ్యంగా చిన్నారులు, గర్భిణులు, వద్ధులు ఎండలోకి వెళ్లకుండా ఉండాలి. తప్పని పరిస్థితిలో ఎండలో ప్రయాణాలు సాగించేవారు వడదెబ్బ బారిన పడకుండా కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే సరి.

- ఎండలో ప్రయాణిస్తున్నప్పుడు శరీరం డీహైడ్రేషన్ అయ్యి కళ్లు తిరుగుతాయి. శరీరం ఎరుపుగా మారడం శ్వాస తీసుకోవడం కష్టంగా మారుతుంది. అందుకే నీళ్ల బాటిల్ ఒకటి బ్యాగులో పెట్టుకుని మంచినీళ్లు కొంచెం కొంచెంగా తీసుకుంటూ ఉండాలి.
- ఆరు నెలల్లోపు చిన్నారులకు రెండు గంటలకు ఒకసారి తల్లిపాలు అందించాలి.
- శరీరంపై ఎర్రని పొక్కులు, నీరసం, తీవ్ర జ్వరం, తలనొప్పి, వాంతులు, విరోచనాలు వంటి లక్షణాలు ఉన్న వారు ప్రయాణించకూడదు.
- ఎక్కువ గంటల ప్రయాణం చేసేవారు ద్రవ పదార్థాలై మజ్జిగ, కొబ్బరినీళ్లు, సజ్జా వాటర్, ఎండు కర్జూరం నీళ్లు తాగుండాలి. లేదా పుచ్చకాయ, ఖర్భూజ, బత్తాయి వంటి నీరుశాతం ఉన్న పండ్లు కట్‌చేసి ఓ బాక్సులో పెట్టుకుని తినాలి.
- చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, వృద్ధులతో ప్రయాణించేటప్పుడు ఓఆర్‌ఎస్ ద్రావణాన్ని దగ్గరుంచుకోవాలి.
- మాంసాహారం, మసాలా, కారం, పచ్చళ్లతో చేసిన పదార్థాలను ప్రయాణ సమయంలో తినకూడదు. లేకుంటే గ్యాస్ సమస్యలు తలెత్తుతాయి. తేలిగ్గా జీర్ణమయ్యే కాయగూరలు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలి.
- బండిపై ప్రయాణం చేయాల్సి వస్తే టోపీ, కూలింగ్ అద్దాలు పెట్టుకోవాలి. శరీరం పూర్తిగా తెల్లని కాటన్ బట్టలతో కప్పి ఉంచుకోవాలి. వీలైనంతలో బస్సులో ప్రయాణించడం మంచిది.

నాలుగు కేంద్ర విద్యుత్ ప్రాజెక్టులపై

డిస్కాంలు, కమిషన్ భిన్న వైఖరులు

ఎం. వేణుగోపాలరావు



నాలుగు కేంద్ర విద్యుత్ ప్రాజెక్టులు ఎన్‌టిపిసి కుడిగి మొదటి దశ (244.56 మె.వా.), ఎన్‌టిఇసిఎల్ వల్లూరు (86.15 మె.వా.), ఎన్టీపిఎల్ (ఎన్ఎల్‌సి తమిళనాడు) (121.33 మె.వా.), ఎన్ఎల్సి ఎన్ఎన్‌పిఎస్ (52.70 మె.వా.) ల నుండి విద్యుత్ లభ్యతను 2022–23, 2023–24 సంవత్సరాలకు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ కమిషన్ పరిగణనలోకి తీసుకోలేదు. దీనిపై కమిషన్, విద్యుత్ పంపిణీ కంపెనీలు పరస్పర విరుద్ధంగా భిన్న వైఖరులు తీసుకుంటున్నాయి. ఈ ప్రాజెక్టుల పిపిఎల మిగిలి ఉన్న గడువు 18 నుండి 24 సంవత్సరాల వరకు ఉంది. అయితే, ఆ పిపిఎలకు కమిషన్ ఆమోదం ఇవ్వనందున అవి అమలు కాజాలవని కమిషన్ పేర్కొంది. వాటి చార్జీలు న్యాయంగా లేకపోతే, ఆ విద్యుత్ కొనుగోలుకు అనుమతించటం వినియోగదారులకు ప్రయోజనకరం కాదు. అంతర్ రాష్ట్ర ప్రసార చార్జీలను కూడా కలుపుకుంటే, ఈ నాలుగు స్టేషన్ల విద్యుత్ యూనిట్కు సగటున రూ.5కు పైగా అవుతుంది. ఈ కారణాల వల్ల, ఈ ప్రాజెక్టుల నుండి విద్యుత్ కొనుగోలుకు కమిషన్ గత ఆర్థిక సంవత్సరంలో అనుమతి ఇవ్వలేదు. అయితే విద్యుత్ కొరత వల్ల, మార్కెట్లో చాలా అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వచ్చినందున డిస్కాములు పైనాలుగు కేంద్ర విద్యుత్ ప్రాజెక్టుల నుండి విద్యుత్ కొనుగోలుకు అనుమతిం చాలని కోరగా కమిషన్ అందుకు అనుమతించలేదు. దానిపై డిస్కాంలు అప్పిలేట్ ట్రిబ్యునల్లో దాఖలు చేసిన పిటిషన్ పెండింగులో ఉంది. అయినా, డిస్కాంలు కమిషన్ ఉత్తర్వును ఉల్లంఘించి ఆ నాలుగు ప్రాజెక్టుల నుండి కూడా గత ఆర్థిక సంవత్సరంలో విద్యుత్తును కొనుగోలు చేశాయి.

మొత్తం 17 కేంద్ర విద్యుత్ ప్రాజెక్టులలో జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ మిషన్ మొదటి దశకు సంబంధించిన ఒక యూనిట్ మినహా, మిగిలిన ప్రాజెక్టులకు డిస్కాంలు పిపిఎలను కమిషన్‌కు సమర్పించి అనుమతి పొందటం లేదు. వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకుని కమిషన్ ఏటేటా వార్షిక చార్జీల ఉత్తర్వులలో కేంద్ర విద్యుత్ ప్రాజెక్టుల నుండి విద్యుత్ కొనుగోలుకు అనుమతులు ఇస్తూ వస్తున్నది. కమిషన్ ఆదేశించినా, డిస్కాంలు పిపిఎలను ఆమోదం కోసం సమర్పించకుండా దాటవేస్తున్నా, కమిషన్ సముచిత చర్య ఎందుకు తీసుకోవటం లేదనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. ఒకరకంగా ఇది నియంత్రణ ప్రక్రియను పక్కన పెట్టటమే. ఎందుకోసం, ఎన్నేళ్ళ పాటు కమిషన్ డిస్కాంల ఈ దాటవేత వైఖరి పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తూ ఉంటుంది? ప్రైవేటు విద్యుత్ ప్రాజెక్టులతో చేసుకున్న పిపిఎలను సమర్పించి, కమిషన్ ఆమోదం పొందుతున్న డిస్కాంలు ప్రభుత్వరంగ ప్రాజెక్టులతో చేసుకున్న పిపిఎల విషయంలో అలా ఎందుకు చేయటం లేదు? డిస్కాంలు సకాలంలో నియంతణ ప్రక్రియను పాటించేటట్లు కమిషన్ తన అధికారాన్ని వినియోగించి ఎందుకు నిక్కచ్చిగా వ్యవహరించటం లేదు? అవసరం లేని విద్యుత్‌ను ప్రైవేటు ప్రాజెక్టుల నుండి కొనుగోలు చేసేందుకు ప్రభుత్వాల నిర్ణయాల ప్రకారం డిస్కాంలు వాటి పిపిఎలకు ప్రాధాన్యతనిచ్చి కమిషన్ ఆమోదం పొందుతున్నాయి. ప్రభుత్వ రంగ ప్రాజెక్టులు అమలులో ఉన్నా, ముందు వాటి పిపిఎలకు అనుమతి పొందితే, ప్రైవేటు ప్రాజెక్టుల పిపిఎలకు అనుమతి పొందేందుకు వాటి నుండి విద్యుత్ కొనుగోలు అవసరాన్ని సమర్థించుకొనటం ఇబ్బంది అవుతుంది. ప్రభుత్వ రంగ విద్యుత్ ప్రాజెక్టులు డిస్కాంల కోసమే విద్యుత్ ఉత్పత్తి, సరఫరా చేయడానికి ఉద్దేశించినవి గనుక వాటి పిపిఎలకు ఎప్పుడైనా ఆమోదం పొందవచ్చుననే ఎత్తుగడలను గతం నుండి ప్రభుత్వాలు అనుసరిస్తున్నాయి. ప్రభుత్వ రంగ ప్రాజెక్టులను అమలు చేసే ప్రక్రియను ప్రారంభించినపుడే డిస్కాములు పిపిఎలను చేసుకుని కమిషన్ ఆమోదం పొందే విధంగా రెగ్యులేషన్ చేసి, అమలు చేయాలని అనేక సంవత్సరాలుగా సూచిస్తున్నా, కమిషన్లు పెడచెవిన పెడుతూ వస్తున్నాయి. కేంద్ర విద్యుత్ స్టేషన్ల నుండి కొత్తగా విద్యుత్ కొనుగోలుకు పిపిఎలు చేసుకునే ప్రతిపాదనలను ఇప్పటి నుంచి కమిషన్ ఆమోదం కోసం సమర్పిస్తామని డిస్కాంలు 20 23–24 సంవత్సరానికి సమర్పించిన ఎఆర్ఆర్ ప్రతిపాదనలలో నివేదించాయి. ఇదే వైఖరి ప్రైవేటు విద్యుత్ ప్రాజెక్టుల విషయంలో కూడా అనుసరించాలి.

పై నాలుగు కేంద్ర విద్యుత్ ప్రాజెక్టులను పరిగణించకుండానే, 2023–24లో 9982 మె.వా. కాంట్రాక్టు చేసిన థర్మల్ ప్రాజెక్టుల స్థాపక సామర్థ్యంతో 80 శాతం పిఎల్ఎఫ్తోనే 8000 మె.వా. బేస్ సామర్థ్యం (రోజంతా ఉత్పత్తి చేసే సామర్థ్యం) అవసరాన్ని 2000 మె.వా.

సౌర, 2500 మె.వా. పవన, 500 మె.వా. జల విద్యుత్తో తీర్చవచ్చునని కమిషన్ పేర్కొంది. రోజంతా విద్యుత్ ఉత్పత్తి చేసే ప్రభుత్వ ర ంగ థర్మల్ ప్రాజెక్టులున్నప్పటికి, విపరీతంగా మిగులు విద్యుత్ తేలే విధంగా ప్రైవేటు సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టుల నుండి అవసరం లే ని విద్యుత్ కొనుగోలుకు ప్రభుత్వాల ఆదేశం మేరకు డిస్కాంలు చేసుకున్న దీర్ఘకాలిక పిపిఎలకు కమిషన్లు విచక్షణా రహితంగా అనుమ తులనిస్తూ వచ్చాయి. నష్టదాయకమైన, సమర్థనీయం కాని భారీ మిగులు విద్యుత్ ఒక పక్క, అదే సమయంలో పీక్ డిమాండును తీర్చేంద కు మార్కెట్లో విద్యుత్ కొనాల్సిన పరిస్థితిలో, విద్యుత్ లభ్యతను గణనీయంగా తక్కువగా చూపే ప్రయత్నం కమిషన్ చేసింది. ప్రభుత్వాల అసమంజస నిర్ణయాల ప్రకారం డిస్కాంలు చేసుకున్న అవసరం లేని పిపిఎలకు అనుమతులను తిరస్కరించని నియంత్రణా వైఫల్యం ఈ పరిస్థితికి దారితీస్తున్నది.

2022–23 ప్రథమార్థంలో లో విదేశీ బొగ్గును వాడటం వల్ల పై నాలుగు కేంద్ర విద్యుత్ ప్రాజెక్టుల చార్జీలు యూనిటు సగటున రూ.6 .47 అనే కారణంతో ఆ విద్యుత్ కొనుగోలుకు డిస్కాంలను అనుమతించని కమిషన్ మార్కెట్లో యూనిట్కు రూ.10.5 వరకు కూడా చెల్లి ంచి కొనటానికి అనుమతి ఇచ్చింది. ఆ నాలుగు ప్రాజెక్టుల నుండి 2022–23లో తాము కొనుగోలు చేసిన విద్యుత్కు అనుమతి ఇవ్వాల న్న డిస్కాంల విజ్ఞప్తిపై ఆ సంవత్సర ఎఫ్పిపిసిఎ (ట్రూ అప్) క్లెయిములను పరిగణించేటపుడు "సముచిత చర్య" తీసుకొంటామని కమి షన్ పేర్కొంది.

పై నాలుగు కేంద్ర విద్యుత్ ప్రాజెక్టుల నుండి విద్యుత్ తీసుకొనకపోయినా, ఏడాదికి రూ.500 కోట్ల స్థిర చార్జీలను తాము చెల్లించాల్సి వస్తుందని డిస్కాములు కమిషన్కు నివేదించాయి. పిపిఎలకు అనుమతి లేకుండా ఆ ప్రాజెక్టుల నుండి కొనని విద్యుత్కు స్థిర చార్జీలను చెల్లి ంచాల్సిన బాధ్యత ఉత్పన్నం కాదని కమిషన్ పేర్కొంది. ఈ పరస్పర విరుద్ధమైన వైఖరులు ఎలాంటి వివాదాలకు దారి తీస్తాయో చూడాల్సివుంది.

సన్‌రైజర్స్.. అదే వ్యథ!

ఛేదనలో హైదరాబాద్ చతికిల ● రాజస్థాన్ రాయల్స్ రాయల్ విక్టరీ



హైదరాబాద్ : సన్‌రైజర్స్ చేతులెత్తేసింది. 20 ఓవర్ల ఆటలో కనీసం ఐదు ఓవర్ల పాటైనా ప్రత్యర్థి జట్టుకు పోటీ ఇవ్వలేదు!.ఐపిఎల్ 16ను ఓటమితో ఆరంభించిన సన్‌రైజర్స్ హైదాబాద్.. రాజస్థాన్ రాయల్స్ చేతిలో 72 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. 204 పరుగుల భారీ ఛేదనలో సన్‌రైజర్స్ హైదరాబాద్ 131/8తో చతికిల పడింది. రాజస్థాన్ పేసర్లు, స్పిన్నర్లు సమిష్టిగా రాణించారు. యుజ్వేంద్ర చాహల్ (4/17), ట్రెంట్ బౌల్ట్ (2/8) సన్‌రైజర్స్ పతనాన్ని శాసించారు. సన్‌రైజర్స్ తరఫున అబ్దుల్ సమద్ (32 నాటౌట్, 32 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్), మయాంక్ అగర్వాల్ (27, 23 బంతుల్లో 3 ఫోర్లు), ఉమ్రాన్ మాలిక్ (19 నాటౌట్, 8 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు) ఓటమి అంతరాన్ని కుదించే ప్రయత్నం చేశారు. తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ రాయల్స్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 203 పరుగుల భారీ స్కోరు చేసింది. రాయల్స్ టాప్–3 బ్యాటర్లు జోశ్ బట్లర్ (54, 22 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లు), యశస్వి జైస్వాల్ (54, 37 బంతుల్లో 9 ఫోర్లు), సంజు శాంసన్ (55, 32 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్థ సెంచరీల మోత మోగించారు.

సన్‌రైజర్స్ ఢమాల్ : 204 పరుగుల భారీ ఛేదనలో సన్‌రైజర్స్‌కు ఆరంభ ఓవర్లోనే డబుల్ షాక్ తగిలింది. ట్రెంట్‌బౌల్ట్ ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే రెండు వికెట్లు పడగొట్టి హైదరాబాద్ శిబిరంలో ఒత్తిడి పెంచాడు. ఓపెనర్ అభిషేక్ శర్మ (0), రాహుల్ త్రిపాఠి (0) సున్నా పరుగులకే డగౌట్‌కు చేరుకున్నారు. ఆరంభంలో వికెట్లు చేజార్చుకున్న సన్‌రైజర్స్ మళ్లీ పుంజుకునే ప్రయత్నం చేయలేదు. ఓపెనర్ మయాంక్ అగర్వాల్ (27) క్రీజులో నిలిచినా.. మ్యాచ్ పరిస్థితికి అనుగుణంగా ఆడలేకపోయాడు. భారీ అంచనాల నడుమ హ్యారీ బ్రూక్ (13, 21 బంతుల్లో 1 ఫోర్) నిరాశపరిచాడు. వాషింగ్టన్ సుందర్ (1), గ్లెన్ ఫిలిప్స్ (8) చేతులెత్తేశారు. 52 పరుగులకే 6 వికెట్లు చేజార్చుకున్న హైదరాబాద్ ఓటమి కోరల్లో చిక్కుకుంది. ఇంపాక్ట్ ప్లేయర్ అబ్దుల్ సమద్ (32 నాటౌట్, 13 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్), ఆదిల్ రషీద్ (18, 13 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్), ఉమ్రాన్ మాలిక్ (19 నాటౌట్, 8 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు) సన్‌రైజర్స్ ఓటమి అంతరాన్ని తగ్గించారు. స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ (4/17) నాలుగు వికెట్ల ప్రదర్శన చేయగా.. ట్రెంట్ బౌల్ట్ (2/21) రాణించాడు. 20 ఓవర్లలో 8 వికెట్లకు 131 పరుగులు చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ 72 పరుగుల తేడాతో పరాజయం పాలైంది.

రాయల్స్ రైడ్ : టాస్ నెగ్గిన సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్లాట్ పిచ్‌పై తొలుత బౌలింగ్ ఎంచుకుంది. గత సీజన్ రన్నరప్ రాజస్థాన్ రాయల్స్ ఉప్పల్ మైదానంలో ఎదురుదాడి మంత్రతో బరిలోకి దిగింది. ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (54), జోశ్ బట్లర్ (54) రాయల్స్‌కు బ్యాంగ్ బ్యాంగ్ ఆరంభాన్ని అందించారు. ఇన్నింగ్స్ రెండో ఓవర్లో ఫరూకీపై విరుచుకుపడిన జైస్వాల్.. రెండు ఫోర్లతో 14 పరుగులు పిండుకున్నాడు. స్వింగ్‌స్టర్ భువనేశ్వర్‌పై భారీ సిక్సర్‌తో ధనాధన్ మొదలెట్టిన జోశ్ బట్లర్.. సన్‌రైజర్స్ బౌలర్లను ఊచకోత కోశాడు. వాషింగ్టన్ సుందర్‌ను వరుస బంతుల్లో వరుస సిక్సర్లు కొట్టిన బట్లర్.. 20 బంతుల్లోనే అర్థ సెంచరీ సాధించాడు. ఓ వైపు బట్లర్, మరోవైపు జైస్వాల్ జోరుతో పవర్‌ప్లేలో (36 బంతులు) రాజస్థాన్ 85 పరుగులు పిండుకుంది. పవర్‌ప్లే చివరి ఓవర్లో బట్లర్‌కు మూడు బౌండరీలు కోల్పోయిన ఫరూకీ.. మెరుపు బంతితో అతడి ఇన్నింగ్స్ ముగించాడు. బట్లర్ వికెట్ పడినా.. సన్‌రైజర్స్ పరిస్థితి ఏమాత్రం మెరుగుపడలేదు. కెప్టెన్ సంజు శాంసన్ (55) తోడుగా జైస్వాల్ ఇన్నింగ్స్‌ను దూకుడుగా నడిపించాడు. పది ఓవర్ల అనంతరం రాజస్థాన్ రాయల్స్ 122/1తో నిలిచింది. కెప్టెన్ సంజు శాంసన్ సైతం రెండు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 28 బంతుల్లోనే అర్థ సెంచరీ సాధించాడు. టాప్–3 బ్యాటర్లు ధనాధన్ అర్థ సెంచరీలు నమోదు చేయటంతో రాయల్స్ 200 పైచిలుకు పరుగులు సునాయాసంగా చేసేలా కనిపించింది. కానీ చివరి ఓవర్లలో సన్‌రైజర్స్ కాస్త మెరుగ్గా బౌలింగ్ చేసింది.

ఆదిల్ రషీద్, టి. నటరాజన్ డెత్ ఓవర్లలో ఆకట్టుకున్నారు. ఈ ఇద్దరు కట్టుదిట్టంగా బంతులేయటంతో 200 పరుగుల మార్క్ చేరుకునేందుకు రాయల్స్ కష్టపడక తప్పలేదు. చివరి పది ఓవర్లలో రాయల్స్ 81 పరుగులే చేయగల్గింది. దేవదత్ పడిక్కల్ (2), రియాన్ పరాగ్ (7)లు నిరాశపరిచారు. షిమ్రోన్ హెట్‌మయర్ (22 నాటౌట్, 16 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్) మెరుపులతో రాయల్స్ 200 ప్లస్ పరుగులు చేసింది. సన్‌రైజర్స్ బౌలర్లలో ఫరూకీ, నటరాజన్‌లు రెండేసి వికెట్లు పడగొట్టారు. భువనేశ్వర్ కుమార్ 3 ఓవర్లలోనే 36 పరుగులు సమర్పించుకోగా.. ఫరూకీ 4 ఓవర్లలో 41 పరుగులు ఇచ్చాడు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో

విజయనగరం క్రీడాకారుల హవా

ప్రజాశక్తి–విజయనగరం టౌన్

రాజస్థాన్ రాష్ట్రంలో కోట యూనివర్సిటీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో మార్చి 28 నుంచి 31వ తేదీ వరకు జరిగిన జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో విజయనగరం జిల్లా క్రీడాకారులు సత్తాచాటారు. సబ్ జూనియర్ క్యాడిట్ పోటీల్లో విజయనగరానికి చెందిన సిహెచ్ హర్షవర్ధన, బి యశస్విని, ఎం షణ్ముఖ సిద్ధార్థ వివిధ విభాగాల్లో మూడు కాంస్య పతకాలు కైవశసం చేసుకున్నారు. జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో మూడు పతకాలు రావడం ఇదే మొదటిసారని జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సిహెచ్ వేణుగోపాలరావు తెలిపారు. న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయస్థాయి పోటీలకు వెళ్లి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను వారు అభినందించారు.







Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68